


Truth of News

PRGI Reg No: APTEL/26/A4781

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

అన్నమయ్య జిల్లా | సంపుటి: 03 | సంచిక : 55 | శనివారం 03 అక్టోబర్ 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi


## రాజ్‌ఘాట్‌లో మోదీ.. బాపూజీకి నివాళి!



**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం**

దేశవ్యాప్తంగా గాంధీ జయంతి వేడుకలు జరుగుతున్న వేళ.. దేశ రాజధాని ఢిల్లీలోని రాజ్‌ఘాట్‌లో మహాత్మా గాంధీకి ఘన నివాళులు అర్పించారు. మహాత్మా గాంధీ 157వ జయంతి సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ రాజ్‌ఘాట్‌కు చేరుకుని బాపూజీ సమాధి వద్ద పుష్పాంజలి ఘటించారు. అక్టోబర్ 2న నిర్వహించే గాంధీ జయంతి సందర్భంగా రాజ్‌ఘాట్‌లో సర్వమత ప్రార్థన కార్యక్రమం కూడా నిర్వహించారు. గాంధీజీ జీవితంలో సత్యం, అహింస, శాంతికి ఉన్న ప్రాధాన్యతను ఈ సందర్భంగా స్మరించుకున్నారు.

**157వ జయంతి వేళ బాపూజీ స్మరణ**

మహాత్మా గాంధీ 1869 అక్టోబర్ 2న గుజరాత్‌లోని పోర్‌బందర్‌లో జన్మించారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన కీలక పాత్ర పోషించారు. సత్యాగ్రహం, అహింసా మార్గాల ద్వారా బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా

- మిగతా 2లో..

## సీజేపీ దెబ్బకు దద్దరిల్లిన ఢిల్లీ



**న్యూఢిల్లీ/ముంబై- సూర్య వాస్తవం**

దేశ రాజధాని ఢిల్లీ నుంచి ముంబై వరకు నిరసనల వాతావరణం నెలకొంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో కాక్రోచ్ జనతా పార్టీ ఆందోళనలకు పిలుపునిచ్చింది. అక్టోబర్ 2న ముంబైలోని శివాజీ పార్క్ నుంచి 'జైల్ భరో ఆందోళన్' చేపడతామని జబ్రీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ప్రకటించారు. ఈ ఉద్యమాన్ని ఇతర నగరాలకు విస్తరించే ప్రణాళికను కూడా ఆయన వెల్లడించారు.

**ఢిల్లీలో హైఅలర్ట్.. జంతర్ మంతర్ వద్ద ఆంక్షలు**

ఇదే సమయంలో ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద నిరసనలకు సంబంధించి పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు.

- మిగతా 2లో..

## 'సర్'లో మిస్సయిన ఓటర్ల రీ ఎంట్రీకి స్పెషల్ డ్రైవ్

- కొత్తగా అర్హత పొందినవారి పేర్లూ నమోదు
- కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం
- ఓటర్ల నుంచి ఫామ్-6 స్వీకరణ.. నెలరోజుల ప్రక్రియ
- 'సర్' ముగిసిన రాష్ట్రాల్లో అమలు

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం**

'సర్'పై వివాదాలు చెలరేగుతున్న వేళ కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకున్నది. కొత్త జాబితాలో పేర్లు గల్లంతైె నవారిని గుర్తించి తిరిగి చేర్చేందుకు, అర్హత ఉన్న కొత్తవారి పేర్లను నమో దు చేయించేందుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్రాల ఎన్నికల అధికారులకు శుక్రవారం

- మిగతా 2లో..



## కరవుసీమ ఇకపై కనకసీమగా మారుతుంది

- మదనపల్లెలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు శంకుస్థాపన
- సాగునీరు అందిస్తే సీమ రైతులు బంగారం పండిస్తారన్న సీఎం చంద్రబాబు
- మూడేళ్లలో 36 ప్రాజెక్టులు పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని వ్యాఖ్య



**మదనపల్లె - సూర్య వాస్తవం**

కరవుపీడిత రాయలసీమ తలరాతను, రూపురేఖలను మార్చేందుకు గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌ను తీసుకొచ్చా మని, ఈ ప్రాంతాన్ని ఫ్రూట్ బౌల్‌గా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి 'రాయలసీమ హార్టికల్చర్ హబ్', 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్'లకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. సాగునీరు అందిస్తే సీమ రైతులు బంగారం పండిస్తారని అన్నారు. రూ. లక్ష కోట్ల పెట్టుబడితో రాయలసీమను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేసే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని, కరవు సీమ ఇకపై కనకసీమగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. 2026 అక్టోబర్ 2వ తేదీ ఈ ప్రాంత చరిత్రలో నిలిచిపోతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో అదనంగా ఆరు లక్షల హెక్టార్లలో ఉద్యాన పంటలను విస్తరిస్తామని,

- మిగతా 2లో..



## కరవుతో కాదు.. అభివృద్ధితోనే రాయలసీమకు కొత్త గుర్తింపు

- గ్లోబల్ హార్టికల్చర్ హబ్ స్థాయికి రాయలసీమ
- రూ.లక్ష కోట్ల పెట్టుబడితో సమగ్ర అభివృద్ధి ప్రణాళిక
- 10 జిల్లాల్లో మూడు దశల్లో ఇంటిగ్రేటెడ్ హార్టికల్చర్ డెవలప్‌మెంట్ ప్లాన్
- రైతు పొలం నుంచి అంతర్జాతీయ మార్కెట్ వరకు పూర్తి వ్యవస్థ
- పచ్చని చెట్లు నరికిన నేలలోనే నేడు ప్రగతి వనం
- ప్రాజెక్ట్ జలధారతో భూగర్భ జలమట్టాలు సగటున 3.6 మీటర్లు పెరుగుదల
- మదనపల్లెలో రాయలసీమ ఇంటిగ్రేటెడ్ హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ శంకుస్థాపన మహోత్సవంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం**

కరవుతో పోరాడిన రాయలసీమను ఇకపై కరువు సీమగా కాకుండా, ప్రపంచ స్థాయి ఉద్యానవన కేంద్రంగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు. రాయలసీమను

- మిగతా 2లో..



## కండక్టర్‌గా సీఎం విజయ్

- తమిళనాడులో మహిళలకు ఉచిత బస్సు ప్రారంభం
- 'వెట్రి పయనం' పథకానికి ప్రతీయేటా 6వేల కోట్ల ఖర్చు

2లో

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## బాపూఘాట్‌లో జాతిపిత మహాత్మా గాంధీకి ఘన నివాళులు

### గాంధీజీ సేవలను స్మరించుకున్న గవర్నర్, సీఎం, డిప్యూటీ సీఎం

**హైదరాబాద్- సూర్య వాస్తవం**

జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా హైదరాబాద్ లంగర్‌హౌస్‌లోని బాపూఘాట్‌లో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మహాత్మా గాంధీకి ఘన నివాళులు అర్పించారు. గాంధీజీ పాదముద్రలతో ముడిపడిన బాపూఘాట్‌లోని సమాధి వద్ద పుష్పాంజలి ఘటించి, మహాత్ముడి సేవలను స్మరించుకున్నారు.

- మిగతా 22లో..



## బీసీలకు చంద్రబాబు మరోసారి వెన్నుపోటు పొడిచారు

- 34 శాతం రిజర్వేషన్ల జీవో కేవలం రాజకీయ గిమ్మిక్కేనని బొత్స విమర్శ
- చిత్తశుద్ధి ఉంటే రాజ్యాంగ సవరణకు కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్
- సుప్రీంకోర్టుకు వెళ్తామనడం బీసీలను మళ్లీ మోసగించడమేనని ఆరోపణ



**అమరావతి - సూర్య వాస్తవం**

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు బీసీలకు మరోసారి వెన్నుపోటు పొడిచారని వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి బొత్స సత్య నారాయణ తీవ్ర విమర్శలు చేశారు.

- మిగతా 2లో..

# రాజ్‌ఘాట్‌లో మోదీ.. బాపూజీకి నివాళి!

(మొదటిపేజీ తరువాయి)

ప్రజలను ఉద్యమాల్లో భాగస్వాములను చేశారు. గాంధీజీ జయంతిని భారత్‌లో జాతీయ ప్రాధాన్యత కలిగిన రోజుగా నిర్వహించడంతో పాటు.. అక్టోబర్ 2ను ఐక్యరాజ్యసమితి అంత ర్జాతీయ అహింసా దినోత్సవంగా కూడా గుర్తించింది. గాంధీ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా ప్రభుత్వ సంస్థలు, విద్యాసంస్థలు, సామాజిక సంస్థలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి.

గాంధీజీ సిద్ధాంతాలు, స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన పాత్రను గుర్తుచేసుకుంటున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కూడా గాంధీజీకి నివాళు లు అర్పిస్తూ సందేశం ఇచ్చారు. ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో ఘర్షణలు కొనసాగుతున్న నేపథ్యంలో మహాత్ముడి శాంతి, అహింస సందేశం మరింత ప్రాధాన్యమైనదని ఆమె పేర్కొన్నారు. గాంధీ జయంతి కేవలం ఒక జయంతి వేడుకగా కాకుండా.. సత్యం, అహింస, శాంతి, సామాజిక బాధ్యత వంటి విలువలను మరోసారి గుర్తుచేసుకునే సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు.

# సీజేపీ దెబ్బకు దద్దరిల్లిన ఢిల్లీ

(మొదటిపేజీ తరువాయి)

నిరసనల ప్రభావంతో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టడంతో పాటు కీలక ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేశారు. భద్రతా కారణాలతో 11 మెట్రో స్టేషన్లలో ఎంట్రీ, ఎగ్జిట్‌లపై ఆంక్షలు విధించినట్లు తాజా నివేదికలు తెలిపాయి. ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని అధికారులు సూచించారు.

**ఇంటర్నెట్ సేవలపైనా ప్రభావం**

జంతర్ మంతర్ పరిసర ప్రాంతాల్లో మొబైల్ ఇంటర్నెట్ సేవలను నిలిపివేసినట్లు పలువురు వినియోగదారులు పేర్కొన్నారని నివేదికలు వెల్లడించాయి. తమ ప్రాంతంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంటర్నెట్ సేవలు తదుపరి ఆదేశాల వరకు నిలిపివేసినట్లు సందేశాలు వచ్చినట్లు సమాచారం. దీంతో నిరసనల మధ్య ఢిల్లీలో కమ్యూనికేషన్ వ్యవస్థపై కూడా ఆంక్షలు విధించిన పరిస్థితి కనిపించింది.

**శివాజీ పార్క్ చుట్టూ భారీ పోలీసు బందోబస్తు**

ముంబైలో జబ్రూ ఆందోళన నేపథ్యంలో శివాజీ పార్క్ పరిసరాల్లో భారీగా పోలీసు బలగాలను మోహరించినట్లు తాజా సమాచారం. ఆ ప్రాంతాన్ని నో-పార్కింగ్ జోన్‌గా ప్రకటించినట్లు నివేదికలు పేర్కొన్నాయి. మరోవైపు స్థానికంగా కొందరు నివాసితులు నిరసనకు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు కూడా వార్తలు వచ్చాయి. గతంలో ముంబై పోలీసులు శివాజీ పార్క్‌లో జబ్రూకి నిరసనకు అనుమతి నిరాకరించినప్పటికీ, దీప్కే 'జైల్ భరో ఆందోళన్' కొనసాగిస్తామని ప్రకటించారు.

**దేశవ్యాప్త ఉద్యమానికి పిలుపు**

జజుజ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో జబ్రూ దేశంలోని పలు నగరాల్లో ఆందోళనలు చేపట్టనున్నట్లు తెలిపింది. ఎన్నికల ప్రక్రియ, ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన అంశాలపై జబ్రూ ప్రశ్నలు లేవనెత్తుతోంది. మరోవైపు ఎన్నికల కమిషన్ మాత్రం ఓటర్ల జాబితా పరిశీలన ప్రక్రియపై తన వైఖరిని వెల్లడించింది. ఈ నేపథ్యంలో జబ్రూ నిరసనలు దేశవ్యాప్తంగా రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి. ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద భద్రతా ఆంక్షలు, ముంబైలో శివాజీ పార్క్ వద్ద నిరసనల నేపథ్యంలో పరిస్థితిని పోలీసులు పర్యవేక్షిస్తున్నారు. తాజా పరిణామాలు, నిరసనల ప్రభావం, ట్రాఫిక్ ఆంక్షలు, మెట్రో మార్పులపై ఎప్పటికప్పుడు అప్‌డేట్లు వెలువడుతున్నాయి.

# 'సర్'లో మిస్సయిన ఓటర్ల రీ ఎంట్రీకి స్పెషల్ డ్రైవ్

(మొదటిపేజీ తరువాయి)

ఆదేశాలు జారీ చేసింది. 'సర్' ప్రక్రియ పూర్తయిన రాష్ట్రాల్లో ఈ ప్రత్యేక కార్యక్రమం చేపట్టనున్నారు. సర్ ప్రక్రియలో ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం దక్కనంత మాత్రానా అర్హులైన పౌరులు జాబితాలో చోటు కోల్పో కూడదనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఈసీ తెలిపింది. ఓటరు నమో దు నిరంతర ప్రక్రియ అని పేర్కొంది.

**జనం వద్దకు బీఎల్వోలు**

స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్వోలు) జనం దగ్గరికి రానున్నారు. ఇల్లిల్లూ తిరగనున్నారు. అంతకంటే ముందు రెండు జాబితాలను పరిశీలిస్తారు. 'సర్'కు ముందు ఉన్న ఓటర్ల జాబితాను , ప్రస్తుతం ఉన్న జాబితాను పోల్చి.. పాత లిస్టులో పేర్లు ఉండి, కొత్త లిస్టులో కనిపించని వారిని గుర్తిస్తారు. అలాంటి వారి ఇంటికి బీఎల్వోలు వెళ్లి వివరాలను తనిఖీ చేస్తారు. అర్హత పొందిన యువ ఓటర్లు, సవరించిన జాబితాలో పేర్లు గల్లంతైన వారినుంచి ఫామ్ 6ను తీసుకుంటారు. అనంతరం వివరాల కాపీని రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్ల(బీఎల్ఏల)కు అందజేస్తారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో ప్రతి బీఎల్వో వారానికి 20 నుం చి 25మంది ఓటర్ల వివరాలను పరిశీలిస్తారు. నెలరోజుల్లో ఈప్రక్రియ పూర్తయ్యే ఛాన్స్ ఉంటుం ది. 'సర్' ముగిసిన రాష్ట్రాల్లో దీన్ని చేపట్టనున్నారు.

**విమర్శల నేపథ్యంలో..!**

నచ్చని ఓటర్ల పేర్లు తొలగించేందుకే కేంద్రం 'సర్' ప్రక్రియను చేపట్టిందని, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, 'సర్'ను నిలిపివే యాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నా యి. వారం రోజుల ఉద్యమానికి కూడా శ్రీకారం చు ట్టాయి. ఈ క్రమంలో ఈసీ స్పెషల్ డ్రైవ్ ప్రకటించడం ప్రాధాన్యం సంతరించుకుంది. సర్ పూర్త యిన ప్రాంతాల్లో అర్హత ఉన్నప్పటికీ జాబితాలో పేర్లు దక్కనివారిని గుర్తించడంతోపాటు కొత్తగా అర్హత పొందిన యువ ఓటర్ల నమోదును సులభతరం చేయడమే స్పెషల్ డ్రైవ్ ఉద్దేశమని ఈసీ తెలిపింది.

# కండక్టర్‌గా సీఎం విజయ్

చెన్నై- సూర్య వాస్తవం

తమిళనాడు సీఎం సీ జోసెఫ్ విజయ్ బస్సు కండక్టర్ అవతారమెత్తారు. మహిళలకు ఉచిత బస్సు టికెట్లను అందించారు. తమిళనాడు ఎన్నికల్లో ప్రకటించిన మహిళలకు ఫ్రీబస్సు పథకం-2 'వెట్రి పయనం'ను శుక్రవారం సీఎం విజయ్ ప్రారంభించారు. తమిళనాడు ప్రభుత్వ బస్సుల్లో మహిళలకు ఐదేళ్ల క్రితం ప్రారంభించిన 'మగలిర్ విడియల్ పయనం పథకాన్ని గాంధీ జయంతి సందర్భంగా మరి ంత విస్తరించారు. కోయంబేడు బస్ టెర్మినల్‌లో సీఎం ఈ పథకాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా పలువురు మహిళలు, యువతులు సీఎం విజయ్‌కు చాక్లెట్లు ఇచ్చి తమ కృతజ్ఞత చాటుకున్నారు. ఈ పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ బస్సుల్లో మహిళలు, ట్రాన్స్ జెండర్లు ఉచితంగా ప్రయాణించొచ్చు. 84.32 లక్షల మంది మహిళల కు ఈ పథకం ద్వారా ప్రతిరోజూ లబ్ధి చేకూరనుంది. విస్తరించిన పథకం కింద నగరాలు, పట్టణాల్లో ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, ఎల్ఎస్ఎస్, డీలక్స్ బస్ సర్వీస్, మఫిసల్ ప్రాంతాల్లో ఆర్డినరీ సర్వీసుల్లో మహిళలకు ఈ పథకం వర్తించనుంది. తమిళనాడు రాష్ట్ర రోడ్డు రవా ణా సంస్థలు నిర్వహిస్తున్న 18,413 బస్సులలో 12,695 (69 శాతం) బస్సులు ఈ పరిధిలోకి వచ్చాయి. పథకం కోసం తమిళనాడు ప్రభుత్వం ప్రతీయేటా రూ. 6వేల కోట్ల ఖర్చు చేయనుంది.

## కరవుతో కాదు.. అభివృద్ధితోనే రాయలసీమకు

# కొత్త గుర్తింపు





(మొదటిపేజీ తరువాయి)

గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు రూ. లక్ష కోట్ల పెట్టుబడులతో సమగ్ర ప్రణాళికను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. రైతులకు సాగు నీటి సదుపాయాలను మెరుగుపరచడంతోపాటు, పంటలను మార్కెట్లకు వేగంగా తరలించేందుకు అవసరమైన రహదారులు, ఇతర మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. అలాగే, రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర, అదనపు విలువ లభించేలా ఆధునిక కోల్డ్ స్టోరేజీలు, ప్రాసెసింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. పంట ఉత్పత్తి నుంచి నిల్వ, ప్రాసెసింగ్, రవాణా, మార్కెటింగ్ వరకు సమగ్ర వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చి రాయలసీమ రైతుల ఉత్పత్తులను దేశీయ మార్కెట్‌తోపాటు ప్రపంచ మార్కెట్‌కు చేరేలా చర్యలు చేపడుతున్నామని ఆయన వివరించారు.

శుక్రవారం మదనపల్లెలో రాయలసీమ ఇంటిగ్రేటెడ్ హార్టికల్చర్ హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ శంకుస్థాపన మహోత్సవంలో కేంద్ర మంత్రి శ్రీమతి నిర్మాల సీతారామన్ , ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "రాయలసీమ గొప్ప చరిత్రకు, ప్రత్యేకమైన సంస్కృతికి, ఎన్నో చారిత్రాత్మక ఘట్టాలకు సాక్ష్యంగా నిలిచిన నేల. శ్రీకృష్ణదేవరాయలు పాలించిన ఈ ప్రాంతం ఒకప్పుడు అనేక ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంది. ఫ్యాక్షన్ రాజకీయాల ప్రభావంతో అశాంతికి గురైన సందర్భాలు ఉన్నాయి. అభివృద్ధికి ప్రతీకగా నిలవాల్సిన ప్రాంతంలో పచ్చని చెట్లను సైతం నరికి వేసిన పరిస్థితులు చూశారు. ఆ పరిస్థితుల నుంచి రాయలసీమను బయటకు తీసుకువచ్చి, అభివృద్ధి బాటలో నడిపించేందుకు ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఎంతో కృషి చేశారు. 2024లో మీరు అందించిన ప్రజా తీర్పు ఈ మార్పుకు మరింత బలాన్ని ఇచ్చింది. ప్రజలు ఇచ్చిన ఆ విజయంతోనే ఈ రోజు రాయలసీమలో రూ.1 లక్ష కోట్ల పెట్టుబడులతో అభివృద్ధి కార్యక్రమాలకు బాటలు పడ్డాయి.

**రెండేళ్లలో రూ.8 వేల కోట్ల అభివృద్ధి పనులు**

పల్లె పండుగ కార్యక్రమం ద్వారా రాయలసీమలో గత 2 ఏళ్లలో రూ.8 వేల కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపట్టాం. అందులో భాగంగా రాష్ట్రంలో 2 లక్షల ఎకరాల్లో, అందులో రాయలసీమ ప్రాంతాన 62 వేల ఎకరాల్లో 28 వేల మంది రైతులకు లబ్ధి చేకూరేలా ఉద్యాన పంటల సాగును విస్తరించాం. నీటి సంరక్షణలో భాగంగా దాదాపు 70 వేల ఫామ్ పాండ్లను నిర్మించి, అదనంగా 50 వేల ఎకరాల భూమిని సాగులోకి తీసుకొచ్చాం. రూ.4,500 కోట్లకు పైగా నిధులతో 23 వేలకు పైగా రహదారి పనులను చేపట్టి, 5 వేల కిలోమీటర్లకు పైగా రహదారుల నిర్మాణాన్ని పూర్తి చేశాం. ఉపాధి హామీ నిధులతో ప్రాజెక్ట్ జలధార ద్వారా నీటి సంరక్షణ చర్యలను బలోపేతం చేస్తూ, రాయలసీమను నీటి భద్రత ప్రాంతంగా తీర్చిదిద్దే దిశగా ఎన్నో చర్యల చేపట్టాం. తద్వారా ఈ ప్రాంతంలో భూగర్భ జలమట్టాలు సగటున 3.6 మీటర్లు పెరిగాయి.

**45 డిగ్రీల ఉష్ణోగ్రతలోనూ యాపిల్ సాగు**

రాయలసీమ రైతుల పట్టుదలకు ఉద్యాన సాగులో వస్తున్న మార్పులే నిదర్శనం. సాధారణంగా యాపిల్ సాగుకు అనుకూలంగా భావించని 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అనంతపురం ప్రాంతంలోనూ కూడా కె.ఎల్.డి. యాపిల్ సాగు సాధ్యమైంది. రాయలసీమలో మామిడి, అరటి, టమాటా, దానిమ్మ, నిమ్మ, స్వీట్ ఆరెంజ్ తోపాటు డ్రాగన్ ఫ్రూట్, అవకాడో, ఆపిల్, బెర్రీస్ వంటి అధిక విలువ కలిగిన పంటలను కూడా సాగు చేస్తున్నారు. మదనపల్లె ఆసియాలోనే అతిపెద్ద టమాటా సాగు ప్రాంతాల్లో ఒకటిగా ఉంది. రాయలసీమలో ఉద్యాన పంటలకు ఉన్న అపారమైన సామర్థ్యానికి ఇది నిదర్శనం.

**మూడు దశల్లో రూ. లక్ష కోట్ల ప్రణాళిక**

ఇంటిగ్రేటెడ్ హార్టికల్చర్ డెవలప్‌మెంట్ ప్లాన్ కింద రూ.40 వేల కోట్ల ప్రభుత్వ పెట్టుబడితో పాటు, రూ.60 వేల కోట్ల ప్రైవేటు పెట్టుబడులను ఆకర్షిస్తూ, రాబోయే 3 సంవత్సరాల్లో 3 దశల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేయబోతున్నాం. రాయలసీమతో ఎల్ పాటు ప్రకాశం, మార్కాపురం జిల్లాలను కలుపుకుని మొత్తం 10 జిల్లాల్లోని 201 క్లస్టర్లలో ఈ ప్రణాళిక అమలు కానుంది. సాగునీటి కోసం రూ.21 వేల కోట్లతో రిజర్వాయర్లు, కాలువలు, చెరువులను అభివృద్ధి చేసి 9 లక్షల ఎకరాలకు కొత్తగా సాగునీరు అందించడంతోపాటు 4.3 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరిస్తున్నాం. 6.5 లక్షల హెక్టార్లలో మైక్రో ఇరిగేషన్ ను విస్తరిస్తున్నాం. మరో రూ.15 వేల కోట్లతో 6 లక్షల హెక్టార్లలో ఉద్యానవన సాగును విస్తరించి, ప్రస్తుతం ఉన్న 8.4 లక్షల హెక్టార్ల ఉద్యాన విస్తీర్ణాన్ని 14.41 లక్షల హెక్టార్లకు పెంచే లక్ష్యంతో పనిచేస్తున్నాం. సుమారు రూ.4, 500 కోట్లతో దాదాపు 6 వేల కిలో మీటర్ల గ్రామీణ రహదారులను అభివృద్ధి చేస్తున్నాం.

**రైతు పొలం నుంచి ప్రపంచ మార్కెట్ వరకు**

రైతు పండించిన పంటకు సరైన విలువ లభించేలా కోల్డ్ స్టోరేజీలు, ప్యాక్‌హౌస్‌లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, వాల్యూ అడిషన్ సెంటర్లు, ఎగుమతి మౌలిక వసతులను ఉద్యానవన క్లస్టర్లతో అనుసంధానం చేయబోతున్నాం. పంట ఉత్పత్తి నుంచి నిల్వ, ప్రాసెసింగ్, రవాణా, మార్కెటింగ్, ఎగుమతుల వరకు పూర్తి వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నాం. ఈ మౌలిక వసతుల ద్వారా 40 నుంచి 45 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తిని నష్టపోకుండా కాపాడుకునే అవకాశం ఉంటుంది. మూడో సంవత్సరం నుంచి సుమారు రూ.81 వేల కోట్ల అదనపు గ్రాస్ వ్యాల్యూ అడిషన్‌తో పాటు ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 50 లక్షల ఉద్యోగ అవకాశాలు ఏర్పడే అవకాశం ఉంటుంది.

**మదనపల్లెలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్**

మదనపల్లెలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ కు శంకుస్థాపన చేశాం. ఈ సంస్థ రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందించడంతో పాటు డిజిటల్ అగ్రికల్చర్, ప్రిసిషన్ ఫార్మింగ్, క్రాప్ మానిటరింగ్, స్మార్ట్ ఇరిగేషన్, మార్కెట్ ఇంటెలిజెన్స్ వంటి ఆధునిక విధానాలను వ్యవసాయ రంగంతో అనుసంధానం చేయ డంలో ఈ సంస్థ కీలకంగా ఉంటుంది. ఈ ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్య కార్యక్రమంలో భాగస్వామిగా ముందుకు వచ్చినందుకు, మదనపల్లెలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటుకు మద్దతు అందించి నందుకు రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీ అనంత్ అంబానీ గారికి ఆంధ్రప్రదేశ్ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నాను

**జల్ జీవన్ మిషన్‌కు కేంద్ర సహకారం**

గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల నిలిచిపోయిన జల్ జీవన్ మిషన్ ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తిరిగి కొనసాగించాల్సిన అవసరాన్ని గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన వెంటనే, సానుకూలంగా స్పందించి 2028 డిసెంబర్ వరకు పొడిగించి, సుమారు రూ.30 వేల కోట్లతో జల్ జీవన్ మిషన్ ను ముందుకు తీసుకెళ్లేందుకు సహకరించిన గౌరవ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కి ఆంధ్రప్రదేశ్ ప్రజల తరఫున నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తు న్నాను. రాయలసీమను ఇకపై గతంలో ఎదుర్కొన్న కరువులతో కాదు.. సీమ సాధిస్తున్న అభివృద్ధితో, సృష్టిస్తున్న విలువతో, కల్పిస్తున్న అవకాశాలతో, ప్రపంచ మార్కెట్లకు చేరుతున్న తన సామర్థ్యంతో గుర్తించబడేలా తీర్చిదిద్దుదాం. రాయలసీమను ప్రపంచ అవకాశాలకు కేంద్రంగా నిలబెడతాం" అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు నారా లోకేష్, పయ్యావుల కేశవ్, కింజరాపు అచ్చెన్నాయుడు, నిమ్మల రామానాయుడు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ ముఖేష్ అం బానీ, అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తో పాటు కూటమి పార్టీలకు చెందిన శాసన మండలి సభ్యు లు, శాసనసభ్యులు, రాష్ట్ర స్థాయి ఛైర్మన్లు పాల్గొన్నారు.

# కరవుసీమ ఇకపై కనకసీమగా మారుతుంది

(మొదటిపేజీ తరువాయి)

ఈ హబ్ ద్వారా పంటల ఉత్పత్తి, ధరల స్థిరీకరణ సాధ్యమవుతుందని వివరించారు.

ఎన్టీ రామారావు ప్రారంభించిన సాగునీటి ప్రాజెక్టులను ముందుకు తీసుకెళుతున్నామని, హంద్రీనీవా లేకపోతే మదనపల్లె ప్రాంతం వలసలతో ఖాళీ అయ్యేదని గుర్తుచేశారు. మూడేళ్లలో రూ.35,000 కోట్లతో 36 ప్రాజెక్టులను పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామని హామీ ఇచ్చారు. హంద్రీనీవా ఫేజ్-2, వెలిగొండ ఫేజ్-2, మడకశిర బ్రాంచ్ కెనాల్ విస్తరణ పనులను పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీని 'ఆంధ్రా బిడ్డ' అని అభివర్ణించిన చంద్రబాబు, తిరుమలకు ఉచితంగా ఎలక్ట్రిక్ బస్సులు అందించడంపై ప్రశంసించారు. పోలవరం ప్రాజెక్టు పనులు వేగంగా సాగుతున్నాయని, దాన్ని కూడా పూర్తి చేసి ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభిస్తామని తెలిపారు.








# బాపూఘాట్‌లో జాతిపిత మహాత్మా గాంధీకి ఘన నివాళులు

(మొదటిపేజీ తరువాయి)

ఈ సందర్భంగా గాంధీజీ దేశ స్వాతంత్ర్య ఉద్యమానికి చేసిన సేవలను వారు గుర్తుచేసుకున్నారు. సత్యం, శాంతి, అహింసలను ఆయుధాలుగా చేసుకుని స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చిన మహాత్ముడి సేవలు దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని పేర్కొన్నారు. గాంధీజీ చూపిన సత్యం, అహింస, సమానత్వం, మానవత్వం మార్గాలు నేటికీ సమాజానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టడం ద్వారా సమాజంలో శాంతి, సామరస్యం, పరస్పర గౌరవాన్ని పెంపొందించవచ్చని పేర్కొన్నారు. బాపూ ఘాట్ వద్ద గాంధీజీ విగ్రహానికి పుష్పాలు సమర్పించి నివాళులు అర్పించిన అనంతరం నాయకులు మహాత్ముడి సిద్ధాంతాలను స్మరించుకున్నారు. దేశ ప్రజల ఐక్యత, సామాజిక సామరస్యం, మానవ విలువలను కాపాడేందుకు గాంధీజీ ఆలోచనలు తరతరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. బాపూఘాట్ చారిత్రక ప్రాధాన్యాన్ని కూడా ఈ సందర్భంగా గుర్తుచేశారు. 1948లో మహాత్మా గాంధీ చితాభస్మంలో కొంత భాగాన్ని మూసీ, ఈసా నదుల సంగమ ప్రాంతంలో నిమజ్జనం చేసిన ప్రదేశంగా బాపూఘాట్‌కు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. గాంధీ జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమం ద్వారా మహాత్ముడి త్యాగాలు, సిద్ధాంతాలు, దేశానికి ఆయన అందించిన సేవలను మరోసారి స్మరించుకున్నారు.

## బీసీలకు చంద్రబాబు మరోసారి

# వెన్నుపోటు పొడిచారు

(మొదటిపేజీ తరువాయి)

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోను హైకోర్టు రద్దు చేసిన నేపథ్యంలో ఆయన స్పందించారు. ఈ జీవో న్యాయపరంగా నిలవదని తెలిసినా, కేవలం రాజకీయ లబ్ధి కోసమే చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారని మండిపడ్డారు. "రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదని సుప్రీంకోర్టు గతంలోనే స్పష్టంగా తీర్పు ఇచ్చింది. ఈ విషయం తెలిసి కూడా చంద్రబాబు బీసీలను మోసం చేసేందుకు ఈ జీవో ఇచ్చారు. ఇప్పుడు హైకోర్టు కొట్టేయడంతో సుప్రీంకోర్టుకు వెళతానని చెప్పడం బీసీలను మరోసారి మభ్యపెట్టడమే" అని బొత్స అన్నారు. ప్రభుత్వానికి బీసీల పట్ల నిజంగా చిత్తశుద్ధి ఉంటే, పార్ల మెంటులో రాజ్యాంగ సవరణ కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు.

## జిల్లా పోలీస్ కార్యాలయంలో... గాంధీ, శాస్త్రి జయంతి వేడుకలు...!

**సత్యం, అహింసా మార్గంలో నడవాలని పిలుపు**



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** జిల్లా పోలీస్ కార్యాలయంలో జాతిపిత మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఆదేశాల మేరకు ఆర్ఐ పవన్ కుమార్, ఇతర పోలీసు అధికారులు మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా గాంధీజీ చూపిన సత్యం, అహింసా మార్గాన్ని, లాల్ బహదూర్ శాస్త్రి ఇచ్చిన "జై జవాన్ -- జై కిసాన్" నినాదాన్ని స్మరించుకున్నారు. మహనీయుల ఆశయాలకు అనుగుణంగా శాంతిభద్రతల పరిరక్షణతో పాటు సమాజ సేవలో పోలీసు సిబ్బంది అంకిత భావంతో పనిచేయాలని పేర్కొన్నారు.కార్యక్రమంలో పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్ నాథ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్ఎస్ఐ జాఫర్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ ఆశయాలు... యువతకు స్ఫూర్తిదాయకం...!

**- గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన ఆళ్లగడ్డ రాము**



**అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం :** మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా శ్రీవారి సేవకులు గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆళ్లగడ్డ రాము మాట్లాడుతూ.. నేటి యువతకు మహాత్మా గాంధీ జీవితం ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. దేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు గాంధీజీ అహింస, శాంతియుత మార్గంలో పోరాటం చేసి అనేక త్యాగాలు చేశారని తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీవారి సేవకులు ప్రకాష్, శివ, ప్రసాద్, అనిల్, సుంకు రెడ్డి, సురేష్, హనుమంతు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎద్దులపల్లిలో వన్యప్రాణి వారోత్సవాలు





**పామిడి - సూర్య వాస్తవం :** మండలంలోని ఎద్దులపల్లి గ్రామంలో జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని గుత్తి అటవీ శాఖ అధికారి (ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్) కర్రిముల్లా శుక్రవారం వన్యప్రాణి మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి పైన ప్రతి ప్రాణికి జీవించే హక్కు ఉందని మూగ జీవుల ఆవాసాలను కాపాడుట, భావితరాలకు పచ్చని భవితను అందిద్దామన్నారు. అడవులలో జీవించే ప్రతిప్రాణి శాఖాహారమైనవని, వాటిని రక్షించడం వల్ల ఆ మూగ జీవులు అడవులను రక్షిస్తాయన్నారు. అందుకే దేశవ్యాప్తంగా ప్రతి ఏటా అక్టోబర్ 2 నుంచి 8వ తేదీ లోపు వన్యప్రాణుల వారోత్సవాలను జరుపుకుంటున్నామన్నారు. అడవుల పెంపకం మానవుని జీవన శైలికి,ఆరోగ్యానికి ఎంత ఉపయోగమో, వన్యప్రాణాలను కాపాడుకొనుట అంత ముఖ్యమైనదన్నారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కరీముల్లా, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ (గార్డ్) సతీష్, సిబ్బంది గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీకి షాక్...
## వైసీపీలోకి బండి శివయ్య చేరిక...!

**- పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించిన తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి**

**- రాప్తాడు నియోజకవర్గంలో వైసీపీకి చేరికల పరంపర..**





**అనంతపురం ప్రత్యేక ప్రతినిధి - సూర్య వాస్తవం :** కనగానపల్లి మండలం కోనాపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయ కుడు బండి శివయ్య వైసీపీలో చేరారు. రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సమక్షంలో ఆయన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా బండి శివయ్యకు తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించినట్లు తెలిపారు.కోనాపురం గ్రామంలో వైసీపీ కార్యకర్తలు, నాయకులు ఆయనకు స్వాగతం పలికారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అందరినీ కలుపుకొని ముందుకు సాగుతామని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దేవనబండ వైఎస్ఆర్సిపి శ్రేణుల్లో కొత్త ఉత్సాహం..

**- పార్టీ బలోపేతానికి గాంధీ రెడ్డి ప్రవీణారెడ్డి సారథ్యంలో భారీ ముందడుగు.**

**- దేవనబండలో వైసిపి నాయకులకు గుర్తింపు కార్డుల పంపిణీ చేసిన గాంధీ రెడ్డి, ప్రవీణ రెడ్డి**

**- పత్తికొండలో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం**



**పత్తికొండ -సూర్య వాస్తవం :**వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా గ్రామస్థాయిలో పార్టీ శ్రేణులను సమన్వయం చేస్తూ నాయకులు, కార్యకర్తలకు గుర్తింపు కల్పించే కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ ఆదేశాల మేరకు దేవనబండ గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులకు పార్టీ కార్యకర్తలకు గుర్తింపు కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గాంధీ రెడ్డి, మాజీ సర్పంచ్ పొట్లపాటి ప్రవీణమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో దేవనబండ గ్రామానికి చెందిన పార్టీ నాయకులకు గుర్తింపు కార్డులు అందజేశారు.ఈ సందర్భంగా వైసిపి సీనియర్ నాయకులు గాంధీ రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ఉంటూ గ్రామ స్థాయిలో పార్టీ కార్యక్రమాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని తెలియజేశారు. పార్టీ శ్రేణుల మధ్య అనుసంధానాన్ని పెంపొందించడంతో పాటు క్షేత్రస్థాయిలో కార్యకలాపాలను కొనసాగించడంలో గుర్తింపు కార్డులు ఉపయోగపడతాయని నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో దేవనబండ గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**మంత్రి ఫారుక్,జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న**

## హుసేనాపురం ప్రధాన ఉపాధ్యాయులు బి చంద్రమౌళి



**ప్యాపిలి- సూర్య వాస్తవం :**నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం లో స్వచంద్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో గాంధీ జయంతిని పురస్కరించుకొని పాఠశాల విద్య శాఖ తరుపున స్వచ్ఛ పాఠశాల గా ఎంపికయిన, పీఎం శ్రీ ప్యాపిలి మండలం హుసేనాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. చంద్ర మౌళి వారి స్కూలుని నాణ్యమైన విద్యను అందించడంలో జిల్లా స్థాయిలోనే ఉందన్నందుకు మంత్రి ఫరూక్ మరియు జిల్లా కలెక్టర్ ,డీఈవో జనార్దన్ రెడ్డి, వెంకట్రామిరెడ్డి చేతుల మీదుగా స్వచ్ఛ పాఠశాల అవార్డును పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.చంద్రమౌళి అవార్డు అందుకున్నారు వారికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

**రాష్ట్రస్థాయి గణితవిజ్ఞాన, సంస్కృతి మహోత్సవంలో**

## విద్యామందిరం ప్రతిభ



**పామిడి - సూర్య వాస్తవం :** స్థానిక పామిడి పట్టణంలోని శ్రీసరస్వతి విద్యామందిరం ఉన్నత పాఠశాల విధ్యాభారతి రాష్ట్రస్థాయి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 30, అక్టోబర్ 1వ తేదీలలో విజయవాడలోని నూతక్కిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి గణితవిజ్ఞాన సంస్కృతి మహోత్సవంలో శ్రీసరస్వతీ విద్యా మందిరం ఉన్నత పాఠశాల విద్యార్థులు ఘనంగా ప్రతిభ కనబరిచారు.వారిలో బాలాజీ సైన్స్ మోడల్స్ ప్రథమ స్థానం,మాథ్స్ ఎక్స్పరిమెంట్స్ మొదటి స్థానం,సాయిప్రణీత్ మాథ్స్ పేపర్ ప్రెసెంటేషన్‌లో, మహీధర్ రెడ్డి రెండవ బహుమతి శశాంక్ రెడ్డి, ఇలా విద్యార్థులు కనపరిచిన ప్రతిభను, సహకరించిన తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు పాఠశాల ప్రభందకారిణి సభ్యులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జె.శ్రీనివాసరావు యం.సునిల్ కుమారరెడ్డి, కార్యదర్శులు బి.వి. రత్నమయ్య, చౌడయ్య, ప్రధానా చార్యులు సిఆర్. శ్రీనివాసన్, ఉపాధ్యాయ బృందం,విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

## పోలీస్ స్టేషన్‌లో సీఐ ఈరన్న ఆకస్మిక తనిఖీ



**బెలుగుప్ప- సూర్య వాస్తవం :** బెలుగుప్ప మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను ఉరవకొండ రూరల్ సీఐ ఈరన్న శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని వివిధ రికార్డులు, కేసులకు సంబంధించిన దస్త్రాలను పరిశీలించారు. స్టేషన్‌లో నమోదైన వివిధ కేసుల వివరాలను ఎస్ఐ శివను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తు పురోగతి, కేసుల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. అదేవిధంగా స్టేషన్‌లోని రికార్డులను ఎప్పటి కప్పుడు సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించినట్లు సమాచారం.త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మండలంలో శాంతిభద్రతల పరిస్థితి, సమస్యాత్మక ప్రాంతాలు, తీసుకోవాల్సిన ముందస్తు భద్రతా చర్యలపై కూడా సీఐ ఈరన్న ఎస్ఐ శివతో చర్చించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని పోలీసు సిబ్బందికి సూచించారు.

## జనసేన కార్యాలయంలో గాంధీకి ఘన నివాళి

**- గాంధీజీ సేవలను స్మరించుకున్న జనసేన నాయకులు**

**- అహింస, సత్యాగ్రహ మార్గాలు నేటికీ స్ఫూర్తిదాయకం : గౌతమ్ కుమార్**



**ఉరవకొండ టౌన్ - సూర్య వాస్తవం :** మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ఉరవకొండ జనసేన పార్టీ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. జనసేన పార్టీ ఉరవకొండ నియోజకవర్గ ఇంచార్జి గౌతమ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా దేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు మహాత్మా గాంధీ చేసిన కృషి, ఆయన అందించిన సేవలను నాయకులు స్మరించుకున్నారు. గాంధీజీ అనుసరించిన అహింసా మార్గం, సత్యాగ్రహ సిద్ధాంతాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ మండల అధ్యక్షులు చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు రాజేష్, జనసేన నాయకులు దేవేంద్ర, బోగేష్, మణికుమార్, అనిల్ కుమార్, నీలకంఠ తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న యువకులు
## మానసిక రోగులకు అండగా యువత







**పామిడి - సూర్య వాస్తవం :** స్థానిక పామిడి పట్టణంలో నిస్సహాయ స్థితిలో ఉన్న వారిని ఆదుకోవడమే పరమావధిగా ఆకలి తీరుద్దాం సేవాబృందం చేస్తున్న సేవలు ప్రతి ఒక్కరినీ కదిలిస్తున్నాయి.

కొన్ని నెలలుగా పామిడి పట్టణంలో రోడ్లపై తిరుగుతూ మానసికంగా మతిస్థిమితి సరిగా లేక అనారోగ్యంగా ఆకలి దప్పులతో అలమటిస్తున్న ఇద్దరు వ్యక్తులను సేవా బృందం అండగా నిలచింది..కేవలం ఆకలి తీర్చడమే కాకుండా,వారికి మూడు పూటలా పౌష్టికాహారం అందిస్తూ మానవత్వాన్ని చాటుకుంటున్నారు. శుక్రవారం కూడా రోడ్లపై ఉన్న మానసిక రోగులను చేరదీసి, వారికి స్నానం చేయించి, క్షురకర్మలు (షేవింగ్, కటింగ్) పూర్తి చేసి, నూతన వస్త్రాలను అందజేశారు. అంతేకాకుండా, వారి శరీరాలపై ఉన్న దీర్ఘకాలిక గాయాలను శుభ్రం చేసి, మందులు రాసి, కట్లు కట్టి వైద్య సహాయం అందించారు. ఈ అద్భుతమైన సేవా కార్యక్రమంలో రాము, డేవిడ్, ఆనంద్, కార్తిక్ వారి బృంద సభ్యులు చొరవ తీసుకుని అహర్నిశలు శ్రమిస్తున్నారు. ఆపదలో ఉన్న వారిని అక్కున చేర్చుకుంటున్న 'ఆకలి తీరుద్దాం' అనే సేవా బృందం సభ్యులపై స్థానికులు అభినందనప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.ఇలాంటి నిస్వార్థమైన సేవా కార్యక్రమాలు మరెన్నో నిర్వహించాలని, ఈ యువ బృందానికి అందరి మద్దతు లభించాలని ఆశిద్దాం!

# గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు శ్రీకారం... రాయలసీమకు కొత్త దశ...!

- రాయలసీమ స్వర్ణ భవిష్యత్తుకు రూ.1 లక్ష కోట్ల ప్రణాళిక
- హార్టికల్చర్ హబ్‌తో రాయలసీమ అభివృద్ధికి బాటలు ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్




**అనంతపురం - సూర్య వాస్తవం :** అన్నమయ్య జిల్లా మదనపల్లె సమీపంలోని బి.కె.పల్లిలో నిర్వహించిన "గ్లోబల్ హార్టికల్చర్ హబ్--రాయలసీమ రైజింగ్" కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు.రాయలసీమ ప్రాంత సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా రూ.1 లక్ష కోట్ల అభివృద్ధి ప్రణాళికకు శ్రీకారం చుట్టడంతో పాటు, ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ( ఐఎస్ఏ ) నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్, రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ తదితరులు పాల్గొన్నారు.

# అనంతపురం వారసత్వాన్ని... తెలుసుకునేందుకు హెరిటేజ్ వాక్...!

- ఏడు ప్రముఖ వారసత్వ ప్రదేశాల సందర్శన
- అక్టోబర్ 4న ఉదయం 8 గంటలకు ప్రారంభం
- క్యూఆర్ కోడ్ ద్వారా రిజిస్ట్రేషన్‌కు అవకాశం
- నగర చరిత్ర, సంస్కృతిపై అవగాహన కల్పించడమే లక్ష్యం: కలెక్టర్ ఓ ఆనంద్




**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం :** నగరంలోని చారిత్రాత్మక ప్రదేశాలు, సాంస్కృతిక వారసత్వాన్ని ప్రజలకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో అక్టోబర్ 4న ప్రత్యేక హెరిటేజ్ వాక్ నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో నగరంలోని ప్రముఖ చారిత్రక ప్రదేశాలను సందర్శించే అవకాశం కల్పించనున్నారు.హెరిటేజ్ వాక్‌లో భాగంగా విక్టోరియా మెమోరియల్ హాస్పిటల్, చెన్నకేశవ దేవాలయం, తొలి కలెక్టర్ కార్యాలయం, విరూపాక్ష దేవాలయం, జామియా మసీదు, బసవన్న కట్ట, ఐరన్ బ్రిడ్జి తదితర చారిత్రాత్మక ప్రదేశాలను సందర్శించనున్నారు. అనంతపురం నగర చరిత్ర, సంస్కృతి, వారసత్వ విశేషాలను తెలుసుకోవడంతో పాటు వాటి ప్రాధాన్యతను భావితరాలకు తెలియజేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశంగా నిర్వాహకులు తెలిపారు. నగర వారసత్వాన్ని సంరక్షించుకోవాల్సిన బాధ్యతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని పేర్కొన్నారు. హెరిటేజ్ వాక్‌లో పాల్గొనాలనుకునే వారు పోస్టర్‌లో ఉన్న కోడ్‌ను స్కాన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు.

# శ్రీ లక్ష్మీ నర సింహస్వామి భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే గుమ్మును జయరాం

**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి పట్టణం గుత్తి కోటలో వెలిసిన శ్రీ లక్ష్మి నరసింహ స్వామివారి భూమి పూజ కార్యక్రమంలో హాజరైన ముఖ్యఅతిథిగా హాజరైన గుంతకల్లు నియోజకవర్గం శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం ముందుగా ఆలయ కమిటీ వారు ఘన స్వాగ తం పలికారు ముందుగా ఎమ్మెల్యే శ్రీ లక్ష్మీనరసింహ స్వామిని దర్శించు కుని అనంతరం భూమి పూజ చేసి ఎమ్మెల్యే మాట్లాడుతూ గుత్తి కోటలో వెలిసిన శ్రీలక్ష్మి నరసింహ స్వా మి భూమి పూజ కార్యక్రమంలో పా ల్గొన్నందుకు నాకు చాలా సంతోషక రంగా ఉందని తెలిపారు.ఇక్కడకు వచ్చే భక్తాదులకు ఎలాంటి ఇబ్బం దులు కలగకుండా చూసుకోవాలని తెలిపారు రాబోయే రోజుల్లో ఈ దే వాలయం ఇంకా అభివృద్ధి చేస్తామ ని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆల య కమిటీ వారు గుత్తి పట్టణం, మండల కూటమి నాయకులు కార్యకర్తలు, అనుబంధ కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.



# ఎన్నికల ప్రక్రియలో... జవాబుదారీతనం అవసరం...!

- ఓట్ల తొలగింపుపై ప్రతిపక్షాల నిరసన గళం...
- ఎస్ఐఆర్ నిలిపివేయాలని డిమాండ్
- అర్హులైన ఒక్క ఓటు కూడా తొలగిపోకుండా చర్యలు తీసుకోవాలి
- అర్హులైన ఓటర్లకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తాం
- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ నవాజ్ సాహెబ్






**అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం :** ఎస్ఐఆర్ ఎన్నికల ప్రక్రియను నిలిపివేసి, తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ నవాజ్ సాహెబ్ డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ వామపక్ష పార్టీలు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం అనంతపురం నగరంలో నిరసన ర్యాలీ నిర్వహించారు.కృష్ణ కళామందిర్ వద్ద ప్రారంభమైన ర్యాలీ టవర్ క్లాక్ సర్కిల్ మీదుగా గాంధీ విగ్రహం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఓటు హక్కును కాపాడేందుకు ఎన్నికల ప్రక్రియను పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని కోరారు. ఎస్ఐఆర్‌లో తొలగించిన ఓట్లను పునఃపరిశీలించి, అర్హులైన ఓటర్ల పేర్లను జాబితాలో పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. నవాజ్ సాహెబ్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించకుండా ఎన్నికల అధికారులు పారదర్శకంగా వ్యవహరించాలని కోరారు. ఓటు హక్కు ప్రతి పౌరుడి రాజ్యాంగ హక్కు అని, అర్హత ఉన్న ఒక్క ఓటు కూడా తొలగిపోకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఎన్నికల యంత్రాంగంపై ఉందన్నారు. ఓటర్ల జాబితాలో పేర్లు తొలగించబడిన వారికి తమ అభ్యంతరాలను ఆధారాలతో సమర్పించేందుకు తగిన అవకాశం కల్పించాలని కోరారు.ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో నమ్మకం పెరగాలంటే ప్రతి దశలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని ఆయన పేర్కొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి, అర్హులైన ఓటర్ల పేర్లను పునరుద్ధరించే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.

ఎన్నికల ప్రక్రియలో అవకతవకలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని, ప్రజల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని నాయకులు కోరారు. ఈ సందర్భంగా కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని కూడా వారు డిమాండ్ చేశారు.నిరసన కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ, ఎస్‌యూసీఐ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాయలసీమ రైజింగ్ కార్యక్రమంలో పాల్గొన్న గుంతకల్లు ఎమ్మెల్యే, కార్మిక సంక్షేమ శాఖ బోర్డు చైర్మన్

**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి మండలంలోని తురకపల్లి గ్రామం ప్రపంచ ఉద్యాన కేంద్రం ఏర్పాటుతో అభి వృద్ధి పరంగా ప్రత్యేక గుర్తింపు పొందే అవకాశం ఉంది. ఉద్యాన రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం,పరిశో ధనలు,నూతన సాగు పద్ధ తులు, పంటల నాణ్యత పెం పుదల వంటి అంశాలకు ఈ కేంద్రం వేదికగా నిలవనుం ది.రాయలసీమ ప్రాంతంలో ని రైతులకు ఆధునిక వ్యవ సాయ విధానాలపై అవగా హన కల్పించడంతో పాటు ఉద్యాన పంటల సాగును మరింత ప్రోత్సహించే అవ కాశాలు ఉన్నాయి.రాయల సీమలోని వాతావరణ పరి స్థితులు,భూముల స్వభా వానికి అనుగుణంగా మా మిడి, అరటి, చీనీ, దానిమ్మ, బత్తాయి తదితర ఉద్యాన పంటలకు ప్రాధాన్యత ఉంది. ఈ పంటల సాగులో ఆ ధునిక పద్ధతులను అందు బాటులోకి తీసుకురావడం, నాణ్యమైన ఉత్పత్తులను అభివృద్ధి చేయడం,మార్కె టింగ్ అవకాశాలను విస్తరిం చడం వంటి అంశాలు రైతు లకు ఉపయోగకరంగా మా రనున్నాయి.ప్రపంచ ఉద్యా న కేంద్రం ద్వారా వ్యవసా య పరిశోధనలు,శిక్షణ, సాంకేతిక పరిజ్ఞానం,వ్యవ సాయ ఆధారిత పరిశ్రమల కు ప్రోత్సాహం లభించే అ వకాశం ఉంది.పంటలని ల్వ,గ్రేడింగ్,ప్యాకింగ్,ప్రాసె సింగ్ వంటి రంగాలు అభి వృద్ధి చెందితే రైతులకు మా ర్కెట్ పరంగా మరిన్ని అవ కాశాలు అందుబాటులోకి వస్తాయి.అలాగే స్థానిక యువతకు నైపుణ్యాభి వృద్ధి,ఉపాధి అవకాశాలు విస్తరించేందుకు దోహద పడుతుంది.గుత్తి మండలం లోని తురకపల్లి గ్రామంలో ఈ కేంద్రం ఏర్పాటు కావడం ద్వారా గ్రామీణ ప్రాంతాల అ భివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయి. రహదారులు,రవాణా,ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి కూడా ప్రాధాన్యత పెరిగే అవకాశం ఉంది. వ్యవసా య రంగంతో పాటు అనుబంధ వ్యాపారాలు, సేవారం గాలు అభివృద్ధి చెందడం ద్వారా స్థానిక ఆర్థిక వ్యవస్థ కు ఊతం లభించనుంది. ఈ కార్యక్రమంలో గుత్తి మండ లం కూటమి నాయకులు కా ర్యకర్తలు పాల్గొన్నారు.



# జర్నలిస్టుపై దాడులను అరికట్టాలి

-జర్నలిస్టు హక్కులకు చట్టబద్ధమైన రక్షణ కల్పించాలి
- రైల్వే పాసులపై 50 శాతం రాయితీ ఇవ్వాలని డిమాండ్



**గుంతకల్ - సూర్య వాస్తవం :** ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి సమాజానికి, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తున్న జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేస్తూ గుంతకల్లులో కోరికల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్య క్రమంలో ముందుగా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసినివాళులర్పించారు. అనంతరం జర్నలిస్టుల సమస్యలు, పెండింగ్‌లో ఉన్న పలు అంశాలను పరిష్క రించాలని కోరుతూ నియోజకవర్గ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరుడు, గుంతకల్లు మండల ఇన్‌చార్జి గుమ్మనూరు నారాయణస్వామికి వినతిపత్రం అంద జేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల తరఫున ప్రశ్నించే బాధ్యతను జర్నలిస్టులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. ప్రజలకు సంబంధించిన సమస్యలు, ప్రభుత్వ శాఖల్లోని లోపాలు, ప్రజలకు ఎదుర వుతున్న ఇబ్బందులను వార్తల రూపంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లడం పాత్రికేయుల ప్రధాన బాధ్యతగా పేర్కొన్నారు. అయితే ప్రజా సమస్యలపై నిష్పక్షపాతంగా వార్తలు ప్రచురించిన సందర్భాల్లో కొందరి నుంచి జర్నలిస్టులకు ఒత్తిళ్లు, బెదిరింపులు, దాడులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.వార్త తమకు అనుకూలంగా లేదనే కారణంతో జర్నలిస్టులను లక్ష్యంగా చేసుకోవడం, వారిపై ఒత్తిడి తీసుకురావడం సరికాద న్నారు. అధికారాన్ని ఉపయో గించుకుని పాత్రికేయులను ఇబ్బందులకు గురిచేసే పరిస్థితులకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. జర్నలిస్టులు ఎలాంటి భయాందోళనలు లేకుండా తమ వృత్తి బాధ్యతలను నిర్వహించేందుకు ప్రభుత్వం తగిన రక్షణ కల్పించాలని కోరారు.

**ప్రత్యేక చట్టంతో రక్షణ కల్పించాలి :**

జర్నలిస్టులపై దాడులు జరిగిన సందర్భాల్లో బాధ్యులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకునే విధంగా ప్రత్యేక పాత్రికేయ రక్షణ చట్టాన్ని రూపొందించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల భద్రత, వృత్తి స్వేచ్ఛ, హక్కులకు చట్టబద్ధమైన రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.ప్రభుత్వ అధికారులు, పోలీసు అధికారులు జర్నలిస్టులతో సమన్వయంతో వ్యవహరించాలని కోరారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే విలేకరుల పట్ల గౌరవభావంతో వ్యవహరించాలని, విధి నిర్వహణలో వారికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

**రైల్వే ప్రయాణంపై 50 శాతం రాయితీ :**

విధి నిర్వహణలో భాగంగా జర్నలిస్టులు నిత్యం వివిధ ప్రాంతాలకు ప్రయాణించాల్సి వస్తుందని తెలిపారు. ఈ నేపథ్యంలో జర్నలిస్టులకు రైల్వే పాసులపై 50 శాతం రాయితీ కల్పించే అంశాన్ని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. జర్నలిస్టుల ప్రయాణ సౌకర్యాలు, సంక్షేమానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన జర్నలిస్టుల పెండింగ్ సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని గుమ్మనూరు నారాయణస్వామిని కోరారు. జర్నలిస్టుల సమస్యలను సంబంధిత ప్రభుత్వ విభాగాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభంగా భావించే పాత్రికేయ వ్యవస్థ స్వేచ్ఛగా పనిచేసే వాతావరణం ఉండాలని, జర్నలిస్టుల హక్కులకు భంగం కలగకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. జర్నలిస్టుల భద్రత, సంక్షేమం, వృత్తి స్వేచ్ఛ కోసం తమ డిమాండ్లను ప్రభు త్వం దృష్టికి తీసుకెళ్లడం కొనసాగిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో రఫీ, వెంకటరాముడు, శ్రీనివాస్, ఖాజావలి, కె. హరి, చిన్న, ఆనంద్, గుమ్మనూరు నాగార్జున, రాజేష్, శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఖైదీలు సత్ప్రవర్తనతో త్వరగా జనజీవన స్రవంతిలో కలవాలి

**- జైలు జీవితం తర్వాత సమాజంలో బాధ్యతాయుతంగా జీవించాలి - జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్**





**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం :** జాతిపిత మహాత్మా గాంధీజీ 157వ జయంతి సందర్భంగా అనంతపురం జిల్లా సెంట్రల్ జైలులో ఖైదీల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ ఐఏఎస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జైలు జీవితం అనుభవిస్తున్న ఖైదీల కోసం పలు మంచి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఖైదీలు సత్ప్రవర్తనతో మెలిగి, తమలో మార్పు తీసుకువచ్చి త్వరగా జైలు జీవితం నుంచి బయటకు వచ్చి జనజీవన స్రవంతిలో కలిసేందుకు కృషి చేయాలని సూచించారు. ఖైదీలలో మానసిక పరివర్తన, సామాజిక బాధ్యత పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జైలు అధికారులు, సిబ్బంది, ఖైదీలు పాల్గొన్నారు.

## ఉద్యాన సాగుతో అధిక లాభాలు పొందాలి

**- ప్రభుత్వ ప్రోత్సాహకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి: ఎమ్మెల్యే కాలవ**



**కనేకల్లు - సూర్య వాస్తవం:** ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని ఉద్యాన పంటలను సాగు చేస్తే రైతులు అధిక దిగుబడులతో పాటు మెరుగైన ఆదాయం పొందవచ్చని రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నారు. కనేకల్లు మండలం గోపులా పురంలో శుక్రవారం ఉద్యాన పంటల సాగుపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాయలసీమను ప్రపంచస్థాయి ఉద్యాన పంటల కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్--రాయలసీమ రైజింగ్' కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. రూ.లక్ష కోట్లతో చేపట్టిన ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో మదనపల్లెలో శుక్రవారం శంకుస్థాపన జరిగినట్లు తెలిపారు.

రాయలసీమతో పాటు ప్రకాశం ప్రాంతంలో ఉద్యాన పంటల సాగును విస్తరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. రైతులకు అవసరమైన మౌలిక వసతులు, సాంకేతిక సహకారం, సాగునీరు, మార్కెటింగ్ సదుపాయాలు కల్పించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని వివరించారు. అనంతపురం జిల్లాలో ఉద్యాన రంగ అభివృద్ధికి పెద్దఎత్తున నిధులు కేటాయించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. రాయదుర్గం నియోజకవర్గంలో సుమారు రూ.200 కోట్లతో పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహించడంతో పాటు, పంటలను మార్కెట్లకు తరలించేందుకు రూ.118 కోట్లతో గ్రామీణ రహదారులను అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. బీటీపీ ప్రాజెక్టు పరిధిలో అవసరమైన అభివృద్ధి పనులకు కూడా నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రైతు సేవా కేంద్రాల్లో ఉద్యాన పంటల సాగు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, ఆధునిక సాగు విధానాలపై రైతులు సంబంధిత అధికారుల నుంచి వివరాలు తెలుసుకోవాలని సూచించారు. పండ్ల మొక్కలతో పాటు డ్రిప్ ఇరిగేషన్, అవసరమైన ఎరువులు తదితర సదుపాయాలను పథకం కింద అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. తక్కువ శ్రమతో ఎక్కువ విస్తీర్ణంలో పండ్ల తోటలను సాగు చేసేందుకు ఆధునిక సాంకేతికత దోహదపడుతుందని, తద్వారా ఉత్పాదకతతో పాటు రైతుల ఆదాయం పెరిగే అవకాశం ఉందని కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు.



ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను రైతులు సద్వినియోగం చేసుకుని ఉద్యాన పంటల సాగును విస్తరించాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వన్నారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు లాలేప్ప, రాష్ట్ర ఉప్పర కార్పొరేషన్ డైరెక్టర్ ఆనంద్ రాజు, మార్కెట్ యార్డు చైర్మన్ హనుమంతరెడ్డి, ఆది, నవీన్, కలేకుర్తి సుదర్శన్, చెరువు సంఘం రమేష్, నాగరాజు, హనకనహాల్ నాగార్జున, యూనిట్ ఇన్‌చార్జి చంద్‌బాషా, మాబుసాబ్, వెంకటేశులు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## మున్నా నగర్ చెత్త సమస్యను... ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లిన ఐఎంఎం మహబూబ్ బాషా...!

**- ఎమ్మెల్యే ఆదేశాలతో వెంటనే స్పందించిన మున్సిపల్ సిబ్బంది**

**- సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యేకు స్థానికుల కృతజ్ఞతలు**





**అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం :** అనంతపురం పట్టణం మున్నానగర్‌లోని పవర్ ఆఫీస్ వెనుక ఫస్ట్ లైన్‌లో ఐఎంఎం మహబూబ్ బాషా నివాసం సమీపంలో పేరుకుపోయిన చెత్తాచెదారంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దాదాపు రెండు నెలలుగా చెత్త పేరుకుపోయి ఉన్నప్పటికీ మున్సిపల్ సిబ్బంది కొరత కారణంగా తొలగించ లేకపోయామని సిబ్బంది తెలిపినట్లు స్థానికులు పేర్కొన్నారు. ఈ సమస్యను శుక్రవారం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ నిర్వహించిన కార్యక్రమంలో ఐఎంఎం మహబూబ్ బాషా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించడంతో మున్సిపల్ సిబ్బంది అక్కడికి చేరుకుని పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని పూర్తిగా తొలగించి పరిసరాలను పరిశుభ్రం చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించిన ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌కు స్థానిక ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## మహిళల భద్రతే ధ్యేయంగా... రంగంలోకి శక్తి బృందాలు...!

**- మహిళలు, విద్యార్థినులు, చిన్నారుల భద్రతపై ప్రత్యేక చైతన్యం**

**- సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని సూచన**



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** మహిళలు, విద్యార్థినులు, చిన్నారుల భద్రతే లక్ష్యంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో శక్తి బృందాలు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాయి. జిల్లా ఎస్పీ పి. జగదీష్, ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లాలోని అన్ని సబ్ డివిజన్ల పరిధిలో 11 పాఠశాలలు, కళాశాలలు, ప్రధాన కూడళ్లలో కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలు, విద్యార్థినులు, చిన్నారుల భద్రతకు సంబంధించిన పలు అంశాలపై శక్తి బృందాలు అవగాహన కల్పించాయి. సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాట్సాప్ డీపీని అందరికీ కనిపించేలా ఉంచడం, అపరిచితులతో ఫొటోలు దిగడం, ఫొటో మార్ఫింగ్, బ్లాక్ మెయిలింగ్ వంటి అంశాలపై జాగ్రత్తలు వివరించారు. ఆపద సమయంలో శక్తి యాప్‌లోని ఎస్‌ఓఎస్ బటన్‌ను వినియోగించే విధానాన్ని ప్రయోగాత్మకంగా వివరించారు. రాత్రి ప్రయాణాల సమయంలో అందు బాటులో ఉన్న నైట్ షెల్టర్ సదుపాయాలపై కూడా అవగాహన కల్పించారు. విద్యార్థినులకు స్వీయ రక్షణ మెళకువలను ప్రదర్శించడంతో పాటు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు.



అదే విధంగా సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. బ్యాంకుల పేరుతో వచ్చే నకిలీ ఫోన్ కాల్స్‌ను నమ్మవద్దని, ఓటీపీ, ఏటీఎం/కార్డు వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని అపరిచితులకు వెల్లడించవద్దని సూచించారు. అత్యవసర సమయంలో 100 లేదా 112, మహిళల సహాయం కోసం 181, చిన్నారుల సహాయం కోసం 1098 నంబర్లను సంప్రదించాలని శక్తి బృందాలు సూచించాయి. మహిళల భద్రత, సైబర్ అప్రమత్తత, స్వీయ రక్షణపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు.

## స్వర్ణలో వీబీజీ రాంజీపై ప్రత్యేక గ్రామసభ

**- గాంధీ జయంతి సందర్భంగా గ్రామాభివృద్ధిపై చర్చ**



**బెళుగుప్ప - సూర్య వాస్తవం :** మండలంలోని స్వర్ణ గ్రామ పంచాయతీ కార్యాలయంలో గాంధీ జయంతి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి మంజునాథ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తొలుత మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గ్రామసభలో వీబీజీ రాంజీ పథకంపై గ్రామస్థులకు అధికారులు అవగాహన కల్పించారు. పథకం కింద ఉపాధి పనిదినాలను 100 నుంచి 125 రోజులకు పెంచడం, పథకం మార్గదర్శకాలు, దరఖాస్తు విధానం తదితర అంశాలను వివరించారు. గ్రామంలో చేపట్టాల్సిన ఉపాధి పనులను గుర్తించి, వాటి ప్రణాళికపై గ్రామస్థులతో చర్చించారు. అలాగే పారిశుధ్య నిర్వహణ, గ్రామ స్వచ్ఛత, గ్రామాభివృద్ధి పనులపై చర్చించారు. ప్రజల భాగస్వామ్యంతో గ్రామాన్ని పరిశుభ్రంగా, అభివృద్ధి దిశగా తీర్చిదిద్దేందుకు సమన్వయంతో పనిచేయాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మల్లికార్జున, బాలాజీ, రుద్రయ్య, ధనంజయ చంటి, చంద్ర, ఏపీవో మురళీకృష్ణ, టీఏ అవినాష్, రుద్రమణి, ఎఫ్ఏ శివ, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## భారీ రక్తదాన శిబిరం



**పామిడి - సూర్య వాస్తవం :** దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్త సేవోత్సవాల్లో భాగంగా స్థానిక పామిడి పట్టణంలోని ఎద్దులపల్లి రోడ్డులో గల టిడిపి కార్యాలయం ఎదురుగా శుక్రవారం బిజెపి ఓబీసీల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరంను ఘనంగా నిర్వహించారు. ఈశిబిరానికి స్థానిక ప్రజలు, యువత నుండి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆపదలో ఉన్న తోటి ప్రాణాలను కాపాడటమే పరమావధిగా స్థానిక యువతీ యువకులు పార్టీ శ్రేణులు ఈ శిబిరంలో స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేస్తున్నందుకు వారి మానవత్వానికి జోహార్లన్నారు. "సేవయే సంకల్పం" అన్న ప్రధాని మోదీ పిలుపును స్ఫూర్తిగా తీసుకుని సమాజ శ్రేయస్సు కోసం నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఓబీసీ మోర్చా ప్రతినిధులు పేర్కొన్నారు. ప్రాణదాతలుగా పాల్గొన్న రక్తదాతలకు ప్రశంసా పత్రం అందజేసారు. వారి సామాజిక సేవాదృక్పథాన్ని స్థానిక బీజేపీ సీనియర్ నాయకులు ప్రత్యేకంగా కొనియాడారు. ఈ రక్తదాన శిబిరంలో గుంతకల్లు నియోజకవర్గ ప్రముఖ నాయకులు,కూటమి నాయకులు మండల బీజేపీ ఓబీసీ మోర్చా ప్రధాన నాయకులు కార్యకర్తలు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అద్యక్షుడు కొనగొండ్ల రాజేష్,మహిళా మోర్చా అధ్యక్షురాలు దగ్గుపాటి సౌభాగ్య ,ఓబీసీ మోర్చా జిల్లాఅధ్యక్షుడు నాగేంద్ర, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మనోజ్ కుమార్, బిజెపిమండల అద్యక్షుడు అంజినాయక్, మహిళామోర్చా జిల్లాఉపాధ్యక్షురాలు పూజారి లక్ష్మీదేవి, సీనియర్ నాయకులు సుందరయ్య కుమారస్వామి, రామనరేష్,యువనాయకులు రాజశేఖరగౌడ్ పవన్,నరేష్ యాదవ్, చంద్ర, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు

## తాసిల్దార్ కార్యాలయంలో ఘనంగా గాంధీ జయంతి



**దొరవారిసత్రం- సూర్య వాస్తవం :** అహింసా వాది,స్వాతంత్ర పోరాట యోధుడు, జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకను దొరవారిసత్రం తాసిల్దార్ కార్యాలయంలో ఘనంగా ఏర్పాటు చేశారు.ఆయన చిత్రపటానికి తాసిల్దార్ రాజేంద్ర,సహచర సిబ్బంది పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ స్వాతంత్ర పోరాటంలో అహింసనే ఆయుధంగా చేసుకుని స్వాతంత్ర్య పోరాటంలో ఆంగ్లేయులపై పోరాడి గెలిచిన మహనీయుడని గుర్తు చేశారు. ప్రతి వ్యక్తికి శాంతి,అహింస, నిజాయితీ అనే ఆయుధాలతో ఏదైనా సాధించవచ్చు అని అన్నారు.ఆయన భౌతికంగా లేకపోయినా ఆయన స్వాతంత్ర పోరాటంలో చేసిన సాహసాలు, సాహసోపేత కార్యక్రమాలు చరిత్రపుటల్లో శాశ్వతంగా నిలిచిపోయాయని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ నాగరాజు, వీఆర్వో అయ్యప్ప,వీఆర్ఏలు పాల్గొన్నారు.

## అడవులను రక్షిద్దాం వన్యప్రాణులకు రక్షణ కల్పిద్దాం




**దొరవారిసత్రం- సూర్య వాస్తవం :**వన్యప్రాణులైన పక్షి జాతులతో పాటు,అడవుల్లో సంచరించే ప్రతి జంతువుకు రక్షణ కల్పించాలని నేలపట్టు పక్షుల కేంద్రం సిబ్బంది శుక్రవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు.అక్టోబర్ నెల రెండవ తేదీ నుండి 8 వరకు వన్యప్రాణుల వారోత్సవాలు సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.విశ్వంలో పక్షులు వలన కలిగే ప్రయోజనాలను తెలిపారు. అదేవిధంగా అడవులను రక్షించడం,వన్యప్రాణులను వేటాడి చంపకుండా,ప్రతి ఒక్కరూ కాపాడాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఎఫ్ ఎస్ ఓ బాలయ్య,ఎఫ్ బి ఓ రాజేశ్వరి,గైడ్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో అంగన్వాడి ఆయా మృతి



**దొరవారిసత్రం- సూర్య వాస్తవం :**దొరవారిసత్రం మండల పరిధిలోని ఏకొల్లు గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం (2)లో ఆయాగా పనిచేస్తున్న శ్యామలమ్మ శుక్రవారం మృతి చెందారు.బంధువుల వివరాల మేరకు శ్యామలమ్మ అనారోగ్యానికి గురైంది.ఆ పరిస్థితులు వైద్య సేవలు నిమిత్తం నెల్లూరు లోని అపోలో హాస్పిటల్‌కి తరలించి చికిత్స ప్రారంబి ంచారు. అక్కడ షుగర్ స్థాయి 500ఎస్త్ర/సశ్రీ పై స్థాయికి పెరగడంతో బ్రెయిన్ స్ట్రోక్ గురై వైద్యం సహకరించక మృతి చెందినట్లు వివరాలు అందించారు.ఈ సంఘటనతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. ఈ సమాచారం తెలుసుకున్న అంగన్వాడీల సిబ్బంది కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు.

## గాంధీజీ ఆశయాలను ఆదర్శాలను మనమంతా పాటిద్దాం...

**దొరవారిసత్రం- సూర్య వాస్తవం :**జాతిపిత మహాత్మా గాంధీజీ ఆశయాలను ఆదర్శాలను మనమంతా పాటించి ఆదర్శంగా నిలవాలని తెలుగుదేశం పార్టీ నాయకులు,తిరుపతి కో-ఆపరేటివ్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ పి భువన్ కుమార్ రెడ్డి చెప్పారు.జాతిపిత మహాత్మా గాంధీ 157 వ జయంతిని పురస్కరించుకొని శు క్రవారం తన కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి భువన్ కుమార్ రెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం మహాత్మా గాంధీ చేసిన త్యాగాలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని, అలాంటి మహోన్నత వ్యక్తి జయంతిని,వర్ధంతిని జరుపుకోవడం భారతీయులందరి బాధ్యత అని పేర్కొన్నారు.స్వాతంత్ర్య ఉద్యమంలో సత్యం అహింస మార్గాల ద్వారా ప్రజలను ఏకం చేసిన గాంధీజీ సామాజిక అసమానతల నిర్మూలనకు అన్ని వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారన్నారు. మహాత్మా గాంధీ తో పాటు భారత మాజీ ప్రధాని లాల్ బహుదూర్ శాస్త్రి నిస్వార్థ సేవలు శాంతి సత్యం నిజాయితీతో కూడిన వారి సిద్ధాంతాలు యావత్ ప్రపంచానికి ఆదర్శనీయమన్నారు.ఈ కార్యక్రమంలో ఆనంద్ బాబు,చింత సురేష్,శంకర్, పురుషోత్తం,బాల యాదవ్ పాల్గొన్నారు.



# స్వచ్ఛతా హి సేవ -- స్వచ్ఛ భారత్ దివస్ ।

## - ధర్మవరంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సత్య కుమార్

**దొరవారిసత్రం- సూర్య వాస్తవం :**

స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా ధర్మవరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ అండ్ వైద్య విద్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ పాల్గొన్నారు. మహాత్మా గాంధీ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చారని, పరిశుభ్రతకు ఆరోగ్యానికి నేరుగా సంబంధం ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయ కత్వంలో స్వచ్ఛతా హి సేవ వంటి కార్యక్రమాల ద్వారా ప్రజల భాగ స్వామ్యంతో పరిశుభ్రతను సామాజిక బాధ్యతగా ముందుకు తీసుకెళ్తున్నామని మంత్రి సత్య కుమార్ యాదవ్ పేర్కొన్నారు. ”స్వచ్ఛతలో భాగస్వామ్యం స్వచ్ఛ భారత్,వికసిత భారత్”అనే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ పరిశుభ్రతలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ధర్మవరాన్ని ”స్వచ్ఛ ధర్మవరం’గా తీర్చిదిద్దేందుకు ప్రజలు,



ప్రజాప్రతినిధులు, అధికారులు, సామాజిక సంస్థలు సమష్టిగా పనిచేయాలని కోరారు.మన ఇల్లు ఎంత పరిశు భ్రంగా ఉంచుకుంటామో,మన పరిసరాలను కూడా అంతే



పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

# గాంధీ జయంతి వేడుకలు

## - మహాత్ముడి విగ్రహానికి కాంగ్రెస్ ఇంచార్జ్ కిరణ్ కుమార్ ఘన నివాళి



**దొరవారిసత్రం- సూర్య వాస్తవం :** జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని సూళ్లూరుపేట ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ డి.కిరణ్ కుమార్ పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ,గాంధీజీ కలలుగన్న సమాజాన్ని నెహ్రూ ప్రధానిగా పునాదులు వేసి దేశాన్ని ముందుకు నడిపించారని అన్నారు.ఇందిరా గాంధీ భూ సంస్కరణలు,బ్యాంకుల జాతీయం, పేదలకు ఇళ్ల నిర్మాణంతో ప్రజలకు ఆశాజ్యోతిగా నిలిచారని కొనియాడారు.

బీజేపీ ప్రభుత్వం మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్చి గాంధీజీ పేరును ప్రజలు మర్చిపోయేలా చేస్తోందని విమర్శి ంచారు. బీజేపీ సామాన్యులను విస్మరించి కార్పొరేట్ సంస్థలకు దారాదత్తం చేస్తోందని ఆరోపించారు.ఎలక్షన్ కమిషన్ ను తన సొంత అజెండాగా మార్చుకొని నరేంద్ర మోడీ, అమిత్ షా లకు తొత్తులా మారి సర్ పేరుతో అర్హుల ఓట్లను తొలగిస్తూ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని ధిక్కరిస్తోందని మండిపడ్డారు. ప్రతి పౌరుడు మేల్కొని అక్రమ ఓట్ల తొల గింపును అడ్డుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్ర మంలో టౌన్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.కె.యాసిన్ భాషా,జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు కన్నంభాకం హరికృష్ణ, కిసాన్ జిల్లా అధ్యక్షులు జోగి వినోద్,నియోజకవర్గ కార్యదర్శి బొగ్గుల సురేష్,టౌన్ మహిళా అధ్యక్షురాలు కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

# గాంధీ, శాస్త్రి ఆశయాలే సమాజానికి మార్గదర్శకం!

## - నాయుడుపేట గాంధీ పార్క్‌లో మహనీయులకు మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం నివాళులు
## - సత్యం, అహింసతో గాంధీ.. దేశభక్తి, నిబద్ధతతో శాస్త్రి ఆదర్శం

**నాయుడుపేట- సూర్య వాస్తవం :** జాతిపిత మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా నాయుడుపేటలో మహనీయుల సేవలను స్మరించుకున్నారు. స్థానిక గాంధీ పార్క్‌లో మహాత్మా గాంధీ విగ్రహానికి మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం స్థానిక నాయకులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లా డుతూ.. సత్యం, శాంతి, అహింసా మార్గాల్లో పయనిస్తూ స్వాతంత్ర్య ఉద్యమానికి నాయకత్వం వహి ంచిన మహాత్మా గాంధీ జీవితం నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. సమాజంలో శాంతి, సామ రస్యం, పరస్పర గౌరవం పెంపొందించేందుకు గాంధీజీ చూపిన మార్గాన్ని అనుసరించాలని పిలుపునిచ్చారు.అలాగే, లాల్ బహదూర్ శాస్త్రి జయంతిని పురస్కరించుకుని దేశానికి ఆయన అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు. నిరాడంబర జీవనం, దేశం పట్ల అంకితభావం, నిబద్ధతతో ప్రజాసేవకు ప్రతీకగా నిలిచిన శాస్త్రి ఆశయాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు.ఈ కార్యక్రమంలో 786 రఫీ, ప్రధాన కార్యదర్శి అవధానం సుధీర్, ఆర్యవైశ్య జనని సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ గూడూరు



కిషోర్ కుమార్, శ్రీ పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నాన బాల సుబ్బారావు, తెలుగుదేశం పార్టీ నాయకులు పసల గంగా ప్రసాద్, పోట్లపూడి రాజేష్, కరీం భాయి చెంచయ్య, జివిఆర్ నాయుడు, నిత్య కృష్ణారెడ్డి, మైలారి రాజశేఖర్, మైలారి అశోక్ కుమార్, వినుకొండ ధనుంజయ, బల్లి ముత్యాలయ్య, చిగురువాడ అశోక్, అరిగొండ జయరాం, చిట్టేటి రేవతి, హైమావతి తదితరులు పాల్గొని మహనీయులకు నివాళులర్పించారు.

# సత్యం అహింస సేవా మార్గంలో నడుస్తూ పరిసరాలను పచ్చదనముతో తీర్చిదిద్దడమే బాపూజీకి మనం అందించే నిజమైన నివాళి

## - “మంత్రి సత్య కుమార్ యాదవ్’

**దొరవారిసత్రం- సూర్య వాస్తవం:**సత్యం,అహింస, సేవా,మార్గంలో నడుస్తూ పరిసరాలను పచ్చదనంతో తీర్చిదిద్దడమే బాబూజీ కి మనం అందించే నిజమైన ఘన నివాళులు అని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రివర్యులు సత్య కుమార్ యాదవ్ అన్నారు.ఆయన శుక్రవారం మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ధర్మవరంలోని గాంధీ సర్కిల్ వద్ద బాపూజీ స్మృతికి నివాళులర్పించాను. అదేవిధంగా మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి స్మృతికి



నివాళులు అర్పించాను. అనంతరం సేవా సంకల్ప్ అభియాన్ లో భాగంగా మొక్కలు నాటడం జరిగింది.ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ సత్యం, అహింస ,సేవా మార్గంలో నడుస్తూ పరిసరాలను పచ్చదనంతో తీర్చి దిద్దడమే బాపూజీకి మనం అందించే నిజమైన నివాళి. అని మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు.



# "డోంట్ ట్రబుల్ ది ట్రబుల్" మూవీ రివ్యూ



ఫాంటసీ కథతో వచ్చిన సినిమాలు ఎప్పుడూ ఇంట్రెస్టింగ్‌గానే అనిపిస్తాయి. ఇలాంటి సినిమా సక్సెస్ సాధిస్తే బాక్సాఫీస్ వద్ద వసూళ్లకు కూడా కొదువ ఉండదు. ఇలాంటి ఓ ఫాంటసీ కథాంశంతో రూపొందిన చిత్రమే 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్'. ఎస్.ఎస్.రాజమౌళి సమర్పణలో కార్తికేయ నిర్మాతగా తెరకెక్కిన ఈ చిత్రంలో మలయాళ నటుడు ఫహద్ ఫాజిల్ కథానాయకుడిగా నటించాడు. ఈసినిమాపై విడుదలకు ముందే హీరో మహేష్ బాబు, ఎన్టీఆర్‌లు ప్రశంసలు కురిపించడంతో సినిమాపై అంచనాలు పెరిగాయి. ఇక 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' చిత్రం కథాంశం ఏమిటి? ఈ చిత్రం ఎలా ఉంది? ఈ సినిమా ప్రేక్షకుల అంచనాలను అందుకుందా? తెలుసుకుందాం. సూరి (ఫహద్ ఫాజిల్) అనాథ. స్నేహితుడు (వెంకటేష్ కాకునూరు)తో కలిసి ఉంటాడు. డబ్బు కోసం అంబులెన్స్‌ను నడుపుతుంటాడు. ఎలాగైనా డబ్బు సంపాదించి జీవితంలో సెటిల్ కావాలని ప్రయత్నిస్తుంటాడు. అందులో భాగంగానే ఓ గొర్రె పొట్టేల్ పోటీలో అస్లాం భాయ్ పొట్టేల్‌ను మోసం చేసి ఓడించి చిక్కుల్లో ఇరుక్కొంటాడు. అస్లాం భాయ్ గ్యాంగ్ సూరి నుంచి 25 లక్షలు డిమాండ్ చేస్తుంది. లేకపోతే నీ ప్రాణాలకే ప్రమాదం అని హెచ్చరించండంతో దాంతో డబ్బు ఎలాగైనా అస్లాం భాయ్ గ్యాంగ్‌కు ఇవ్వాలని ప్రయత్నిస్తుంటాడు. ఇక రిచ్ ఫ్యామిలీకి చెందిన చిన్న పిల్లలని ఎవరైనా కిడ్నాప్ చేసి వచ్చిన డబ్బుల్లో రూ.25 లక్షలు అస్లాం గ్యాంగ్‌కి ఇచ్చేసి, మిగిలిన డబ్బులతో దుబాయ్ వెళ్లిపోవాలని ప్లాన్ చేసుకుంటాడు. అలాంటి సమయంలోనే సంపన్న కుటుంబానికి చెందిన చిన్నారి దివ్య (సారా పాలేకర్) తన అమ్మనాన్నలను తానే మాయం చేశాననీ, వాళ్లను కనిపించేలా చేయాలని అడిగిన దివ్యను, కుక్క స్నూపీని సూరి ఓ ప్లాన్‌తో తన వెంట తీసుకెళ్లి కిడ్నాప్ పథకం మొదలుపెడతాడు. ఇక సూరి పథకం ఫలించిందా? దివ్య తల్లిదండ్రులు ఎవరు? తన అమ్మనాన్నలను తానే మాయం చేశానని దివ్య ఎందుకు చెబుతుంది? చివరికి ఏం జరిగింది? అమ్మనాన్నల్ని కలుసుకోవాలన్న దివ్య కోరికను సూరి నెరవేర్చాడా? అనేది చిత్ర కథ.




ఇలాంటి ఇంట్రెస్టింగ్ ఫాంటసీ కథాంశంతో చిత్రాలు చాలా అరుదుగా వస్తుంటాయి. ఇలాంటి కథాంశాలను ప్రేక్షకాదరణ పొందేలా డీల్ చేయడం.. నిర్మించడం రెండూ కష్టమే. అయితే ఒకవేళ ఇలాంటి సినిమా ప్రేక్షకులకు నచ్చిదంటే దాని రిజల్ట్ కూడా అనూహ్యంగా ఉంటుంది. 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' కూడా ప్రేక్షకులకు అలాంటి ఎక్స్‌పీరియన్స్ ఇవ్వడానికి ఓ ఫాంటసీ కథతో తెరకెక్కింది. అయితే కథాంశం, కాన్సెప్ట్ కొత్తగా ఉన్నా... ఈ ఇంట్రెస్టింగ్ కాన్సెప్ట్‌ను ఎంచుకున్నప్పుడు దానికి తగ్గ స్క్రీన్‌ప్లే, ఎమోషన్.. అన్నింటికి మించి ఆ కథను ఎగ్జిక్యూట్ చేసే ప్రతిభ కలిగి ఉండాలి.. ఈ సినిమా విషయంలో కాన్సెప్ట్ ఓకే.. రచనా పరంగా స్ట్రాంగ్‌గా ఉంటే బెటర్ అవుట్‌పుట్ వచ్చే స్కోప్ ఉండేది. బట్ కథను అత్యంత బోరింగ్‌గా చెప్పడమే ఈ సినిమాకు ఉన్న అతిపెద్ద మైనస్.స్లో నేరేషన్.. వీక్ సీన్స్.. వల్ల ఎక్కడా కూడా సినిమా ఇంట్రెస్టింగ్‌గా అనిపించదు సరికదా.. ప్రేక్షకుడి ఓపికకు పరీక్ష పెట్టేలా ఉంది.ఫస్టాఫ్ సో..సో..గా సాగిన ఈ సినిమా సెకండాఫ్‌లో మరింత బోరింగ్‌గా, ట్రాక్ తప్పిన సినిమాలా అనిపించింది. సినిమా మొదలైన 20 నిమిషాల్లోనే ఈ సినిమా ఎటు వెళుతుంది? ఏమీ చూపించబోతున్నారు అనే అసహనంతోనే సినిమా అంతా ప్రేక్షకుడు భరించాల్సి వస్తుంది. ప్రతి సన్నివేశం సాగదీతగా.. స్లోగా నత్తనడకన సాగుతుంది. సినిమాలో హాస్యం, ఎమోషన్ ఎక్కడా కూడా వర్కవుట్ కాలేదు. సూరి, దివ్య క్యారెక్టర్‌తో ఆడియన్స్ ఎంత ప్రయత్నించినా కనెక్ట్ కాలేరు. పతాక సన్నివేశాల్లో ఎమోషనల్‌గా తెరకెక్కించే ప్రయత్నం చేసినప్పటికీ అది విఫల ప్రయత్నంలానే మిగిలిపోయింది. రచనా పరంగా ఈ సినిమా చాలా బలహీనంగా కనిపించింది. ఓ ఇంట్రెస్టింగ్ కాన్సెప్ట్‌కు తగ్గ స్క్రీన్‌ప్లేను, సన్నివేశాలను రచించడంలో దర్శకుడు ఇంకాస్త శ్రద్ధ పెడితే బాగుండేది. ఓవరాల్‌గా డోంట్ ట్రబుల్ ది ట్రబుల్.. ట్రబుల్స్‌తోనే సాగింది జర్నీ..!

సూరి పాత్రలో ఫహద్ ఫాజిల్ ఎందుకో సెట్ కాలేదని అనిపిస్తుంది. ఆయన నటనకు వంక పెట్టే స్కోప్ లేకపోయినా ఆయన పాత్ర చిత్రణలోనే లోపం కనిపిస్తుంది.? అసలు ఫహద్ ఈసినిమాను ఎలా ఒప్పుకున్నాడు అనే ఆశ్చర్యం.. అతను ఈ సినిమా చేయాల్సినంత కంటెంట్ ఇందులో ఏముంది అనే సందేహం సినిమా చూసిన ప్రతి ఒక్కరిలో కలుగుతుంది.తొలిసారిగా ఈ సినిమాలో ఫహద్ ఫాజిల్ లాంటి గొప్ప నటుడి నటన కూడా ఎంతో సాధారణ స్థాయిలో కనిపించింది. దివ్యగా సారా పలేకర్ చాలా క్యూట్‌గా ఉంది.. స్క్రీన్ మీద ముద్దుగా, అమాయకంగా నటించింది.. కాలభైరవ సంగీతం ఫర్వాలేదనిపించింది. ఎడిటింగ్ మరింత షార్ప్‌గా ఉండాలి. నిర్మాణ విలువలు కనిపించాయి. ఓవరాల్‌గా ఈ ఫాంటసీ కథ బోరింగ్ అండ్ సాగదీత సన్నివేశాలతో ప్రేక్షకుల ఓపికకు పరీక్ష పెట్టేలా..ట్రబుల్స్‌తోనే సాగిన విఫల ప్రయాణంలా అనిపిస్తుంది.




## విజయ్ తనయుడి 'సిగ్మా'..
## సోషల్ మీడియా టాక్ ఇదే!



తమిళనాడు ముఖ్యమంత్రి, ప్రముఖ నటుడు విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయమవుతూ తెరకెక్కించిన చిత్రం 'సిగ్మా'. సందీప్ కిషన్, ఫరియా అబ్దుల్లా జంటగా నటించిన ఈ చిత్రం శుక్రవారం (అక్టోబరు 2) ప్రేక్షకుల ముందుకు వచ్చింది. తొలిరోజు సినిమా చూసిన ప్రేక్షకుల నుంచి సోషల్ మీడియాలో మంచి స్పందన వ్యక్తమవుతోంది. ముఖ్యంగా చిత్రంలోని ట్విస్టులు, యాక్షన్ సన్నివేశాలు, నేపథ్య సంగీతం అద్భుతంగా ఉన్నాయని పలువురు ప్రశంసిస్తున్నారు.ఒక పురాతన నిధి అన్వేషణ (ట్రెజర్ హంటర్) కథాంశంతో ఈ చిత్రం రూపొందింది. సినిమా పూర్తిగా కథానుగుణంగా సాగుతుందని, ఇంటర్వెల్ యాక్షన్ బ్లాక్, తమన్ అందించిన సంగీతం చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలిచాయని వీక్షకులు అభిప్రాయపడుతున్నారు. 'తొలి సినిమా అయినప్పటికీ జాసన్ దర్శకత్వంలో మంచి పరిణితి కనిపించిందని', 'ఇది పక్కా మాస్ ఫీస్ట్', 'సందీప్ కిషన్ నటన, స్క్రీన్ ప్రెజెన్స్ అదరగొట్టారని' నెటిజన్లు సోషల్ మీడియాలో కామెంట్లు చేస్తున్నారు.అయితే, ఈ సానుకూల ఫీడ్‌బ్యాక్‌తో పాటు అక్కడక్కడా మిశ్రమ స్పందన కూడా వ్యక్తమవుతోంది. ప్రథమార్థం కొంత రొటీన్‌గా ఉందని, కథనంలో ఆశించినంత కొత్తదనం లేదని కొందరు విమర్శిస్తున్నారు. సినీ విమర్శకుల నుంచి కూడా ఈ చిత్రంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.చెన్నైలోని ఒక థియేటర్‌లో జాసన్ తల్లి సంగీత, సోదరి దివ్య ఈ సినిమాను వీక్షించారు. జాసన్ సంజయ్ సైతం స్వయంగా ప్రేక్షకులతో కలిసి మొదటి రోజు సినిమాను చూశారు. ఈ చిత్రానికి కృష్ణన్ వసంత్ సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరించారు.



# భారత్ ఏ అసాధారణ పోరాటం..

## ఆస్ట్రేలియా ఏ జట్టుతో రెండో టెస్టు ఉత్కంఠభరిత డ్రా





భారత్ ఏ, ఆస్ట్రేలియా ఏ జట్ల మధ్య జరిగిన రెండో అనధికారిక టెస్టు మ్యాచ్ థ్రిల్లర్‌ను తలపించింది. చివరి రోజు అసాధారణ పోరాటపటిమ కనబరిచిన యశ్ రాథోడ్, షామ్స్ ములానీ గట్టి పట్టుదలతో క్రీజులో నిలబడి మ్యాచ్‌ను డ్రాగా ముగించారు. దీంతో రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ ఏ 1-0 తేడాతో కైవసం చేసుకుంది. తొలి టెస్టులో 162 పరుగుల తేడాతో విజయం సాధించిన భారత్, ఈ మ్యాచ్‌ను డ్రా చేసుకోవడంతో సిరీస్ విజేతగా నిలిచింది.శుక్రవారం, నాలుగో రోజు ఆటలో 365 పరుగుల భారీ లక్ష్య ఛేదనకు దిగిన భారత్ ఏ, ఆట ముగిసే సమయానికి 103 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 310 పరుగులు చేసింది. విజయానికి 55 పరుగుల దూరంలో నిలిచినప్పటికీ, ఆసీస్ బౌలర్ల నిరంతర దాడిని తట్టుకుని ఓటమిని తప్పించుకోవడంలో సఫలమైంది. నైట్‌వాచ్‌మన్‌గా వచ్చిన తుషార్ దేశ్‌పాండే (52), యశ్ రాథోడ్ (80) హాఫ్ సెంచరీలతో కీలక పాత్ర పోషించగా, ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచిన షామ్స్ ములానీ (131 బంతుల్లో 26) అద్భుతమైన డిఫెన్స్‌తో మ్యాచ్‌ను కాపాడాడు.

### కుప్పకూలినా.. నిలబడ్డారు

నాలుగో రోజు ఆట ప్రారంభంలోనే భారత్ ఏ పై ఒత్తిడి పెరిగింది. అయితే నైట్‌వాచ్‌మన్ తుషార్ దేశ్‌పాండే సుమారు 180 నిమిషాల పాటు క్రీజులో నిలబడి ఆసీస్ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్నాడు. కెప్టెన్ దేవదత్ పడిక్కల్ (26)తో కలిసి 60 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. అయితే లంచ్ తర్వాత ఆసీస్ బౌలర్ లియామ్ స్కాట్ (5/52) తన పదునైన బౌలింగ్‌తో మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. వైవిధ్యభరిత బౌన్స్‌తో ఇబ్బంది పెడుతూ పడిక్కల్, దేశ్‌పాండేలతో పాటు తొలి మ్యాచ్ సెంచరీ హీరో కుమార్ కుశాగ్రను కూడా పెవిలియన్ చేర్చాడు. దీంతో భారత్ ఏ 199 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది.

### రాథోడ్, ములానీల వీరోచిత పోరాటం

ఈ క్లిష్ట దశలో యశ్ రాథోడ్, షామ్స్ ములానీ జతకలిశారు. ఓటమి అంచున ఉన్న జట్టును గట్టెక్కించడానికి వీరోచితంగా పోరాడారు. వీరిద్దరూ ఎనిమిదో వికెట్‌కు 131 బంతులు ఎదుర్కొని 85 పరుగుల అమూల్యమైన భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. మ్యాచ్ డ్రా దిశగా సాగుతున్న దశలో లియామ్ స్కాట్ మళ్లీ చెలరేగాడు. మొదట రాథోడ్‌ను, ఆ తర్వాత ములానీని ఎల్బీడబ్ల్యూగా ఔట్ చేసి ఉత్కంఠను తారాస్థాయికి చేర్చాడు. చివరి మూడు ఓవర్లు మిగిలి ఉండగా భారత్ చేతిలో ఒక్క వికెట్ మాత్రమే ఉంది. అన్షుల్ కంబోజ్ స్థానంలో సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన ప్రఫుల్ హింగేతో కలిసి నచికేత్ భూతే (20 నాటౌట్) చివరి ఓవర్లను జాగ్రత్తగా ఆడి మ్యాచ్‌ను డ్రాగా ముగించాడు. దీంతో భారత్ ఏ శిబిరంలో సంబరాలు మిన్నంటాయి.




## ఆసియా క్రీడల్లో భారత్ కు మరో స్వర్ణం..

### 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించిన మహిళల హాకీ టీమ్




భారత మహిళల హాకీ జట్టు అద్భుతం చేసింది. ఏళ్ల తరబడి ఊరిస్తున్న ఆసియా గేమ్స్ స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకుంది. ఏకంగా 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ శుక్రవారం జరిగిన ఫైనల్లో డిఫెండింగ్ ఛాంపియన్ చైనాను ఓడించి పసిడి పతకాన్ని ముద్దాడింది. ఈ చారిత్రాత్మక విజయంతో భారత క్రీడా ప్రపంచంలో సంబరాలు అంబరాన్నంటాయి.అత్యంత ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో భారత జట్టు 1-0 తేడాతో చైనాపై గెలు పొందింది. ఆట తొలి క్వార్టర్‌లోనే లాల్‌రెమ్‌సియామి హ్మార్జోతే అద్భుతమైన ఫీల్డ్ గోల్ చేసి భారత్‌కు ఆధిక్యాన్ని అందించింది. ఆ తర్వాత చైనా గోల్ కోసం తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ, భారత రక్షణ శ్రేణి గోడలా నిలిచింది. ముఖ్యంగా, గోల్ కీపర్ సవితా పూనియా ఒక కీలకమైన పెనాల్టీ స్ట్రోక్‌ను అడ్డుకుని జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. చివరి నిమిషం వరకు ఆధిక్యాన్ని కాపాడుకున్న భారత అమ్మాయిలు చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేశారు.భారత మహిళల హాకీ జట్టుకు ఆసియా క్రీడల్లో ఇది రెండో స్వర్ణం మాత్రమే. చివరిసారిగా 1982లో న్యూఢిల్లీలో జరిగిన ఆసియా గేమ్స్‌లో భారత్ స్వర్ణం సాధించింది. మళ్లీ ఇన్నేళ్లకు ఆ ఘనతను పునరావృతం చేసింది. ఈ విజయంతో భారత జట్టు 2028లో జరగనున్న లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించడం మరో విశేషం. ఈ టోర్నీలో అద్భుత ప్రదర్శన కనబరిచిన భారత జట్టు, ఫైనల్‌కు ముందు సెమీఫైనల్లో దక్షిణ కొరియాపై 2-0 తేడాతో గెలిచిన విషయం తెలిసిందే. ఈ చారిత్రాత్మక విజయంపై క్రీడా లోకం హర్షం వ్యక్తం చేస్తోంది. కాగా, తాజా స్వర్ణంతో ఈ ఆసియా క్రీడల్లో భారత్ బంగారు పతకాల సంఖ్య 16కి పెరిగింది.

# బాపూజీ గ్రామ స్వరాజ్యం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం

## - కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్






**కడప - సూర్య వాస్తవం:** జాతిపిత మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ స్పష్టం చేశారు. కడపలోని ముస్లిం అనాథ శరణాలయంలో గాంధీ జయంతి సందర్భంగా శుక్రవారం మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రహమతుల్లా ఖాన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ మహాత్మా గాంధీ చూపిన ఆదర్శాలు అభిలష నియమన్నారు. భావితరాలకు మార్గ దర్శకాల న్నారు. ప్రస్తుతం నరేంద్ర మోడీ ప్రభుత్వం గాడ్సే పాలనను కొనసాగిస్తుందని విమర్శించారు. భారతదేశాన్ని విధ్వంసం చేసిన ఘనత భారతీయ జనతా పార్టీ ప్రభుత్వాలకు దక్కుతుందన్నారు. మతవిద్వేషాలు విధ్వంసాలు నిత్య కృత్యాలుగా చేసిన ప్రధాని నరేంద్ర మోడీ, హోం మంత్రి అమిత్ షాను ప్రజలు శిక్షించాలని పిలుపునిచ్చారు. మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింస పరమత సహనం, శాంతి, సౌభ్రాతృత్వం మన దేశానికి ఆదర్శ దాయక మన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మయాన రహమతుల్లా ఖాన్ మాట్లాడుతూ జాతిపిత మహాత్మా గాంధీ స్వరాజ్యం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలతోనే వస్తుందన్నారు. మతాల మధ్య చిచ్చు పెడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం దేశాన్ని అస్థిరపాలు చేసిందని విమర్శించారు. బాపూజీ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరు నడవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు రహమతుల్లా, మైనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మాగా మారిన మోహన్ దాస్ కరంచంద్ గాంధీ

## -రాయచోటిలో ఘనంగా జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలు
## -మహాత్ముడికి నివాళులర్పించిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు



**రాయచోటి -సూర్య వాస్తవం:** దక్షిణాఫ్రికాలో జరిగిన జాతి వివక్షను ఎదుర్కొని, అక్కడ నల్లజాతీయులు, భారతీయుల హక్కుల కోసం అహింసాయుత మార్గంలో సత్యాగ్రహం అనే కొత్త విధానాన్నివిజయవంతంగా పరిచయం చేసిన వ్యక్తి మోహన్ దాస్ కరంచంద్ గాంధీ అని రాయచోటి నియోజవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ ఆర్ అమీర్ భాష అన్నారు. అక్టోబర్ 2 శుక్రవారం గాంధీ జయంతి సందర్భంగా స్థానిక ఆర్డిఓ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి పూలమాలవేసి ఘనంగానివాళు లర్పించారు. అనంతరం అందరికీ స్వీట్లు పంచిపెట్టి గాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడు తూ దేశం కోసం గాంధీజీ చేసిన గొప్ప త్యాగాలను, ప్రజల కోసం ఆయన పడిన కష్టాలను చూసి నోబెల్ బహుమతి గ్రహీత రవీంద్ర నాథ్ టాగోర్ ఆయనను ప్రేమతో 'మహాత్మా' అని సంబోధించారని ఆయన చెప్పారు. భారతదేశానికి తిరిగి వచ్చాక, బీహార్‌లోని చంపారణ్ రైతుల సమస్య లపై పోరాడి ప్రజల మన్నన లను పొందారు. ఇక్కడే ఆయనను ప్రజలు 'బాపు' మహాత్ముడిగా భావించడం ప్రారంభించారని ఆయన అన్నారు. సహాయ నిరాకరణోద్యమం, ఉప్పు సత్యాగ్రహం (దండి యాత్ర), క్విట్ ఇండియా ఉద్యమం వంటి వాటి ద్వారా జాతిని నడిపించి, భారతదేశానికి స్వాతంత్ర్యంతీసుకువచ్చారని ఆయన చెప్పారు. ఆయన ఎంచుకున్న కఠినమైన నిజాయితీ మార్గం, సామాన్యులకోసం ఆయన చేసిన నిరంతర త్యాగమే ఆయన్ను ప్రజల గుండెల్లో మహా త్ముడిగా నిలబెట్టాయని ఆయన అన్నారు. భారతదేశం లోని మూడు జాతీయ సెలవు దినాలలోఒకటైన స్వాతంత్ర దినోత్సవాన్ని మిగిలిన రెండు జనవరి 26న గణతంత్ర దినోత్సవం మరియు అక్టోబర్ 2న మహాత్మా గాంధీ పుట్టిన రోజు అన్ని భారతీయ రాష్ట్రాలు మరియు కేంద్ర పాలిత ప్రాంతాలలో జరుపుకుంటారని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. మోహన్ దాస్ కరంచంద్ గాంధీ మహాత్ముడుగా మా రారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# జిల్లా అండర్-19 బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్ ఎంపికలకు విశేష స్పందన

## - భారీగా హాజరైన ఉమ్మడి కడప జిల్లా క్రీడాకారులు



**బ్రహ్మంగారిమఠం- సూర్య వాస్తవం:** బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని శ్రీ వీరబ్రహ్మేంద్ర జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో, కళాశాల కరస్పాండెంట్, మాజీ మంత్రి డాక్టర్ డి.ఎల్. రవీంద్రారెడ్డి సహకారంతో ఉమ్మడి కడప జిల్లా అండర్-19 బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్ ఎంపికలు శుక్రవారం నిర్వహించారు. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో అండర్-19 కార్యదర్శి మురళీకృష్ణారెడ్డి అధ్యక్షతన, ఫిజికల్ డైరెక్టర్ నాగేశ్వరరెడ్డి పర్యవేక్షణలో స్థానిక తెలుగు గంగ క్రీడా మైదానంలో ఈ ఎంపికలు జరిగాయి. ఉమ్మడి కడప జిల్లా నలుమూలల నుంచి సుమారు 200 మంది క్రీడాకారులు ఎంపికలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి మురళీకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ఇంత పెద్ద సంఖ్యలో క్రీడాకారులు ఎంపికలకు హాజరకావడం ఆనందంగా ఉందన్నారు. బ్రహ్మంగారిమఠంలో శ్రీ వీరబ్రహ్మేంద్ర జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో ఇలాంటి క్రీడా ఎంపికలు నిర్వహించడం ద్వారా ఉమ్మడి కడప జిల్లా క్రీడాకారులకు మంచి అవకాశం లభించింద న్నారు. ఎంపికైన క్రీడాకారులు ఏలూరులో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు. రానున్న రోజుల్లో బ్రహ్మంగారిమఠం మండలంలో మరిన్ని క్రీడా పోటీలను నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పోరుమామిళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామిరెడ్డి హాజరై క్రీడా పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో విశ్రాంత అధ్యాపకులు చెన్నారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, నాగిరెడ్డి, శ్రీ వీరబ్రహ్మేంద్ర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ముండ్లపాటి చంద్రశేఖర్, అల్లా బకాష్, మాజీ అండర్-19 ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సుబ్బరాజు, విజయ్ ప్రసాద్‌రెడ్డి, అండర్-17 మాజీ కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, క్రీడాకారులు వెంకట సుబ్బయ్య, హరి, ఆకుల విజయ్‌తో పాటు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



## నిర్మలా సీతారామన్, పవన్ కల్యాణ్‌లను మర్యాదపూర్వకంగా ఆహ్వానించిన జిల్లా బీజేపీ కార్యదర్శి



**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం:** మదనపల్లిలో లక్ష కోట్లతో ప్రారంభించబోయే హార్టికల్చర్ హబ్ శంకు స్థాపనకు విచ్చేసిన కేంద్ర మంత్రి, రాష్ట్రముఖ్యమంత్రి ప్రత్యేక సమయంలో జిల్లాలోని పలు అంశాలపై చర్చించిన నిర్మల్ కుమార్ సానుకూలంగా స్పందించిన సీతారామన్ కచ్చితంగా మీరు చెప్పిన అంశాలపై చర్చిస్తాం అని హామీ ఇచ్చారు. రాబోవు స్థానిక ఎన్నికలలో జిల్లాలోని పరిస్థితులపై రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో మాట మంతి కలిపిన నిర్మల్ కుమార్ పలువురు బీజేపీ నాయకులు, తమ విలువైన సమయాన్ని కేటాయించి సమస్యల గురించి చర్చించిన ఇరువురికీ బిజెపి నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఏపీయన్‌జిజిఓస్ అసోసియేషన్‌లో కో- ఆప్షన్ స్థానాలు భర్తీ




**ప్రొద్దుటూరు - సూర్య వాస్తవం:** ప్రొద్దుటూరు తాలూకా ఏపీ ఎన్జీజీవో అధ్యక్షులు, జెఏసి ఛైర్మెన్ జె.రామసుబ్బయ్య యాదవ్ ఆధ్వర్యంలో అసోసియేషన్ లో ఖాళీ ఏర్పడిన స్థానాలకు కో - ఆప్షన్ జరిగింది. ఈ కార్యక్రమమునకు గౌరవ అతిథిగా కడప జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.శ్రీనివాసులు, నిత్య పూజయ్య , ఎన్నికల పరిశీలకులుగా జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ యన్.రాజశేఖర్ వ్యవహరించారు. సంఘ సభ్యుల అభిప్రాయాలతో ఏకగ్రీవంగా ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ ఎన్నికైన సభ్యులు సంఘ ప్రతిష్ఠను, ఉద్యోగుల ప్రయోజనాలను, హక్కులను కాపాడాలని, సంఘం అభివృద్ధి కోసం పాటుపడాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ మాట్లాడుతూ యన్ జి జి ఓస్ అసోసియేషన్ అంటే ఒక ఉప్పెన లాంటిదని, సంఘం పోరాటాలకు పిలుపు ఇచ్చినపుడు నాయకులు ముందుండి నడిపించాలని , అలాగే ప్రభుత్వ పథకాలు విజయవంతం కావాలంటే ఉద్యోగుల కృషి చాలా ఉందని, మన ఉద్యోగ బాధ్యతలను సక్రమంగా నిర్వ హించినపుడే మనకు గుర్తింపు వస్తుందని తెలిపారు. ప్రొద్దుటూరు తాలూకా అధ్యక్షులు జె.రామసుబ్బయ్య యాదవ్ చాలా స్పీడ్ గా పనిచేస్తున్నారని అలాగే ప్రొద్దుటూరు పట్టణాన్ని ప్లాస్టిక్ రహిత ప్రొద్దుటూరు గా తీర్చి దిద్దే కార్యక్రమములో అడ్వైజరీ కమిటీ ఆధ్వర్యంలో నేను యన్ జి ఓ ప్రెసిడెంట్ కలిసి ముందుకు నడుస్తున్నామని కొనియాడినారు. కొత్తగా ఎన్నికైన అసోసియేటెడ్ ప్రెసిడెంట్ నాగార్జున, వైస్ ప్రెసిడెంట్ మహేశ్వరయ్య, జాయింట్ సెక్రటరీ గంగాదేవి, స్టేట్ కౌన్సిలర్ కిరణ్ సభ్యులను శాలువ పూలమాలతో సన్మానించారు. అలాగే జిల్లా అధ్యక్ష కార్యదర్శులను ప్రొద్దుటూరు తాలూకా అధ్యక్షులు జె.రామ సుబ్బయ్య యాదవ్ సన్మానించారు. తదుపరి విశిష్ట అతిథి కమిషనర్ శ్రీయుత శ్రీనివాస్ విశ్వనాథ్ ని జిల్లా అధ్యక్షులు శాలువ, పూలమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి శ్రీనివాసులు, జాయింట్ సెక్రటరీ పద్మనాభయ్య, హెరామియా తాలూకా సెక్రటరీ ఇ.ప్రమీల, కోశాధికారి సదాశివయ్య, అసోసియేటెడ్ ప్రెసిడెంట్ నాగార్జున,వైస్ ప్రెసిడెంట్ పిఐ.సంధ్యారాణి, వరప్రసాద్ మహేశ్వరయ్య, జాయింట్ సెక్రటరీ సుజాత, సుబ్బారాయుడు, నారాయణ రాజు, గంగాదేవి ,డి ఇ సి మెంబెర్స్ సాదిక్ సాహెబ్, నరసింహ, స్టేట్ కౌన్సిలర్ కిరణ్ మరియు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

### ఎస్.వి. విద్యా మందిర్ హైస్కూల్‌లో

## ఘనంగా గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు

**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం:** రాయచోటి కొత్తపేటలోని ఎస్.వి. విద్యా మందిర్ హైస్కూల్‌లో జాతిపిత మహాత్మా గాంధీజీ జయంతి, మాజీ ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పాఠశాల డైరెక్టర్ డా. ఎం. సుధాకర్ రెడ్డి, సెక్రటరీ డా. ఎన్. నాగేంద్ర విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. డైరెక్టర్ డా. ఎం. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ, సత్యం, అహింస, నిజాయితీ, క్రమశిక్షణ, సేవాభావం గాంధీజీ చూపిన గొప్ప జీవన విలువలని తెలిపారు. విద్యార్థులు ఈ విలువలను కేవలం తెలుసుకోవడమే కాకుండా తమ రోజువారీ జీవితంలో ఆచరించాలని సూచించారు. లాల్ బహదూర్ శాస్త్రి జీవితం నిరాడంబరత, నిజాయితీ, కష్టపడి పనిచేయడం, దేశభక్తి, బాధ్యతాయుతమైన జీవన విధానానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొని మహాత్మా గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రి ఆశయాలను స్మరించుకున్నారు. "సత్యం మా మార్గం -- సేవ మా లక్ష్యం -- దేశభక్తి మా స్ఫూర్తి" అనే సందేశంతో కార్యక్రమం కొనసాగగా, చివరగా జాతీయ గీతం 'జనగణమన' ఆలాపనతో కార్యక్రమం ఘనంగా ముగిసింది.



PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS
ADDRESS : 41/1320, Sankarapuram, Kadapa, YSR Kadapa District, ANDHRA PRADESH-516002, CELL : : 9885404140